RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్ దినపత్రిక

వరంగల్ సంపుటి : 3, సంచిక : 90 | మంగళవారం ఫిబ్రవరి 25, 2025 | పేజీలు : 4 వెల : రూ.3-00

www.vedhanews.in

**విలేకరులు కావలెను**

ప్రజా సమస్యల పరిష్కారమే మా ఎజెండా..ఇంత కాలం మేము ప్రచురించిన కథనాలే అందుకు ఉదాహరణ.. నిజమైన, నిఖార్సైన జర్నలిజానికి వేదికగా నిలుస్తున్న 'వేద న్యూస్' తెలుగు దినపత్రికలో నిజాలు రాసి నిఖార్సైన జర్నలిస్టుగా రాణించాలనుకునే వారికి ఇదే మా ఆహ్వానం..

9701923260, 9701920379








# ఆరోగ్య కేంద్రానికి.. అనారోగ్యం!

- సమస్యల వలయంలో శ్రీరాంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
- రోగులపాలిట శాపంగా మారిన వైనం
- కొన్ని నెలలుగా పని చేయని ఎక్స్ రే మిషన్
- నామమాత్రంగానే టెస్టులు!
- ఇష్టానుసారంగా డ్యూటీలు ?
- కంపు కొడుతున్న మరుగుదొడ్లు
- జిల్లా వైద్యాధికారి పర్యవేక్షణ కరువు?

**వేద న్యూస్, పెద్దపల్లి :**

పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాల్సిన ప్రభుత్వ ఆసుపత్రులు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. వీటి పరిష్కారానికి కృషి చేయాల్సిన ప్రజా ప్రతినిధులు, అధికారుల జాడ కనిపిస్తలేదు. ఆరోగ్య సిబ్బందిని అడిగే వారు లేక.. వచ్చిన వారికి వైద్యం అందక రోగులు అల్లాడుతున్నారు. పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంరోగుల పాలిట శాపంగా మారింది. అరకొర వసతులుతో ఆసుపత్రికి వచ్చే రోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గత కొన్ని నెలలుగా ఎక్రే విభాగానికి చెందిన మిషన్ పనిచేయకపోవడంతో పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా టెక్నీషియన్ ఉద్యోగిని సైతం వేరే చోటుకు స్థాన చలనం కల్పించారని సమాచారం. ఇకపోతే ఆస్పత్రిలో అన్ని రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయని బోర్డు పట్టికలో మాత్రమే దర్శనమిస్తాయి. కానీ కొన్ని మాత్రమే పరీక్షలు చేస్తున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. అలా చేయడం వల్ల పరీక్షలు లేట్ అవ్వడంతో తమ ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాంతో ప్రైవేట్ ల్యాబ్ లకు వెళ్లి అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు చేసి పరీక్షలు చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుందని అంటున్నారు. ఇదిలా ఉంటే ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ల విధి నిర్వహణ లోపాలు కూడా కనిపిస్తున్నట్లు తెలుస్తోంది. రాత్రివేళ అత్యవసర సమయాల్లో స్టాఫ్ నర్సులతోనే నడుస్తుంది తప్ప డాక్టర్స్ డ్యూటీలో ఉండడం లేదని అరోపణలు సైతం బలంగా వినిపిస్తున్నాయి.

**అసలు ఇది ఆసుపత్రినా?**

ఆసుపత్రికి సంబంధించిన ఎమర్జెన్సీ వాహనాలు

మిగతా 4వ పేజీలో..



## భక్తుల కొంగు బంగారం..
# కాళేశ్వరం

**వేద న్యూస్, మహాదేవపూర్ :**

దక్షిన కాశీగా పేరుగాంచిన శ్రీ కాళేశ్వర క్షేత్రం శివనామ స్మరణతో మారుమ్రోగ నుంది. మూడు రోజుల పాటు మహాశివరాత్రి ఉత్సవాలు ఈ క్షేత్రంలో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. శివపార్వతుల కళ్యాణ మహోత్సవానికి కాళేశ్వరం క్షేత్రం వేదిక కానుంది. త్రివేణి సంగమ తీరాని వెలసి కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్న కాళేశ్వరంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివకళ్యాణ మహోత్సవ వేడుకలు ప్రతిఏటా ఘనంగా నిర్వహిస్తారు. స్వామి వారి కళ్యాణమహోత్సవాన్ని కనులారా చూసి తరించేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా మహారాష్ట్ర, చత్తీస్గడ్, మద్యప్రదేశ్ రాష్ట్రాల నుండి వేలాది మంది భక్తులు తరలిరానున్నారు. భక్తులు త్రివేణి సంగమ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి ఉపవాస దీక్షలు, జాగారాలు స్వామివారికి అభిశేకాలు తదితర ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

**క్షేత్ర మహత్యం...**

కాళేశ్వర నివాసోవా కాళ్వేరం నిరీక్షణం కాళేశ్వరస్య స్మరణం సర్వపాప ప్రణాశనం కాళేశ్వరంలో నివసించినను, కాళేశ్వరుని స్మరించిన. చూచిన సర్వపాపాల నశించి ఆయురారోగ్య, ఐశ్వర్య, పుత్ర, పౌత్రాభివృద్ధి కలగటంతో పాటు మరణించిన తరువాత ముక్తికూడా కలుగుతుందని భక్తుల విశ్వాసం. కాశీక్షేత్రం కంటే కూడా కాళేశ్వరం క్షేత్ర మహత్యం ఎక్కువని ప్రాశస్తి ఎందుకంటే

మిగతా 4వ పేజీలో..

## సమాచార హక్కు చట్టాలపై
# అవగాహన కలిగి ఉండాలి

**వేద న్యూస్, వరంగల్ జిల్లా :**



ప్రతి పౌరులు సహ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సమాచార హక్కు రక్షణ చట్టం-2005 సొసైటీ డైరీ వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, సహా చట్టం ప్రభుత్వ పనితీరులో పారదర్శకతనూ, జవాబుదారీతనాన్నీ ప్రోత్సహించి అవినీతి రహిత సమాజ నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సహ చట్టాలను తెలుసుకోవడం ద్వారా ప్రభుత్వ కార్యాలయాల్లో వారికి కావాల్సిన సమాచారాన్ని నేరుగా దరఖాస్తుదారులే పొందవచ్చని అన్నారు. సమాచారం పొందడం రాజ్యాంగపరమైన హక్కు అని అన్నారు. సమాచార హక్కు రక్షణ చట్టం-2005 సొసైటీ ఆధ్వర్యంలో ఎన్నో అవగాహన కార్యక్రమాలు, మరియు సామాన్య ప్రజలకు సహ చట్టాలపై అవగాహన కల్పిస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో వారికి కావాల్సిన సమాచారాన్ని అందించడంలో ముఖ్య పాత్రను పోషిస్తున్నారని తెలిపారు. ప్రస్తుత సమాజంలో అవినీతి నిర్మూలనలో భాగస్వాములై నిరంతరం కృషి చేస్తున్న సహ చట్టం సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ అమీర్ ఖాన్, హనుమకొండ జిల్లా వైస్ ప్రెసిడెంట్ యహి యా జాబురి, హనుమకొండ జిల్లా మీడియా కన్వీనర్ హాలీం షరీఫ్, వరంగల్ జిల్లా లీగల్ అడ్వైజర్ షేక్ కమాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల
# షెడ్యూల్ విడుదల

**వేద న్యూస్, డెస్క్ :**

తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం విడుదల చేసింది. తెలంగాణలో ఐదుగురి ఎమ్మెల్సీల పదవీకాలం మార్చి 29 నాటికి ముగియనుంది. తెలంగాణలో పదవీకాలం ముగిసే వారిలో సత్యవతి రాథోడ్, మహమూద్ అలీ, శేరి సుభాష్‌రెడ్డి, ఎగ్గె మల్లేశం, మీర్జా రియాజుల్ హాసన్ ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది.


- ఎన్నికల నోటిఫికేషన్ మార్చి 3 జారీ కానుంది.
- నామినేషన్ల ప్రక్రియ మార్చి 10 ప్రారంభం అవుతుంది. మార్చి 11 నామినేషన్ల పరిశీలన,
- మార్చి 13 నామినేషన్ల ఉపసంహరణ,మార్చి 20 పోలింగ్,మార్చి 20 ఓట్ల లెక్కింపు కానుంది.

# కదంతొక్కిన కలం కార్మికులు

- కలెక్టరేట్ల వద్ద నిరసన ప్రదర్శనలు
- కలెక్టర్లకు వినతి పత్రాలు
- హైదరాబాద్‌లో సమాచార భవన్ ఎదుట నిరసన
- కమిషనర్‌కు వినతి పత్రం ఇచ్చిన రాష్ట్ర నాయకులు

**వేద న్యూస్, హైదరాబాద్ :**

దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఆందోళన చేపట్టారు. సోమవారం అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన ప్రదర్శనలు నిర్వహించి కలెక్టర్లకు వినతి పత్రాలు సమర్పించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆయా జిల్లా కమిటీల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయాల వద్ద జర్నలిస్టుల నిరసన కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి. ఈ సందర్భంగా అన్ని జిల్లాల్లో ఫెడరేషన్ నాయకులు ఆయా జిల్లాల కలెక్టర్లకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలు సమర్పించారు. రాష్ట్రవ్యాపిత ఆందోళనలో భాగంగా హైదరాబాద్ లోని మాసబ్ ట్యాంక్‌లో గల రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ కార్యాలయం(సమాచార భవన్)వద్ద జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్లు జర్నలిస్టుల సమస్యలు



పరిష్కరించకుండా అన్యాయం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా సమస్యలను పరిష్కరించకుండా జాప్యం చేస్తుందని ధ్వజమెత్తారు. సుప్రీం కోర్టు తీర్పు సాకుతో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకపోవడం,కొత్త అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు ఇంత వరకు ఇవ్వకుండా కమిటీల పేరుతో కాల యాపన చేయడం దుర్మార్గమని అన్నారు. జర్నలిస్టుల పట్ల గత ప్రభుత్వ మాదిరిగా ఈ ప్రభుత్వం కూడా చిన్న చూపు చూడకుండా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన

మిగతా 4వ పేజీలో..

# మళ్లా తెలంగాణ సెంటిమెంట్




హైదరాబాద్ : రాజకీయాల్లో నేతల ప్రతీ మాటకు ఓ లెక్క ఉంటుంది. కొద్ది మంది తమ మాటల ద్వారా ప్రజల్ని తమ వైపు తిప్పుకుంటారు. మరి కొద్ది మంది నేతలు తమ మాటల ద్వారా ప్రత్యర్థి నేతలను, పార్టీలను ఢిఫెన్స్‌లోకి నెడతారు. మరి కొద్ది మంది నేతలు మాట జారి వివాదస్పదమై సెల్ఫ్ డిఫెన్స్‌లోకి జారుకుంటారు. అలాంటి వ్యాఖ్యలతో పార్టీకి, ప్రజలకు ఓ సంకేతాన్ని పంపుతారు ఇంకొందరు. ఇదంతా ఎందుకంటే రాజకీయ నేతలకు ప్రధాన ఆయుధం వారి మాటలే. తెలంగాణ భవన్‌లో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు చర్చాంశనీయమయ్యాయి. ఏపీ సీఎం చంద్రబాబు తెలంగాణలో పాగా వేసేందుకు ప్రయత్నిస్తున్నారు అని కేసీఆర్ వాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు కాకతాళీయంగా చేసినవి కాదన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. చాలా ఆచితూచి ప్రయోగించిన పాత అస్త్రంగా కేసీఆర్ రాజకీయాలన్ని దగ్గరి నుంచి చూస్తోన్న విశ్లేషకులు చెబుతున్నారు. విస్తృత స్థాయి సమావేశంలో కేసీఆర్ చంద్రబాబు పాలన నాటి రోజులను గుర్తు చేశారు. కరెంటు కోతలు, కరెంటు ఛార్జీల పెంపు, ఉద్యమం నాటి పరిస్థితులను చెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే తాను తెలంగాణ ఉద్యమాన్ని ఎత్తుకోవాల్సి వచ్చింది, కనీసం తన పార్టీకి కార్యాలయం దొరకనీయకుండా చంద్రబాబు చేశారని గుర్తు చేశారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జల దృశ్యంలో తన ఇంటినే కార్యాలయంగా ఇస్తే దాన్ని చంద్రబాబు కూల్చివేశారని చెప్పుకొచ్చారు. ఈ వ్యాఖ్యల ద్వారా తెలంగాణ ప్రాంతానికి చంద్రబాబు ప్రధాన శత్రువు అని చెప్పే ప్రయత్నం చేశారు కేసీఆర్. చంద్రబాబు అడుగుపెడితే అవే పరిస్థితులు పునరావృతం అవుతాయని హెచ్చరికను పార్టీ శ్రేణులకు, ప్రజలకు పంపే ప్రయత్నం చేశారు.తెలంగాణ ఏర్పడిన తర్వాత జరిగిన తొలి శాసన సభ ఎన్నికల్లోను కేసీఆర్ ప్రధాన ప్రచారాస్త్రం చంద్రబాబే. తెలంగాణను అడ్డుకున్న వ్యక్తిగా చంద్రబాబును ఆ ఎన్నికల్లో కేసీఆర్ చిత్రీకరించారు. తెలంగాణను అడ్డుకునేందుకు టీడీపీ ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించిన చంద్రబాబు తిరిగి తెలంగాణ రాజకీయాల్లోకి ఎలా రానిద్దామంటూ ప్రతీ సభలో కేసీఆర్ ప్రజలను ప్రశ్నించారు. ఈ ప్రచారం ప్రజల్లోనీ తీవ్ర చర్చ రెకెత్తించింది. కేసీఆర్ ఎత్తుగడ ఫలించింది. ఆ ఎన్నికల్లో గులాబీ పార్టీ మెజార్టీ స్థానాలు గెల్చుకోని అధికారంలోకి వచ్చింది.2018లో కూడా చంద్రబాబును టార్గెట్ చేస్తూ ప్రచారం చేశారు. ఆయన టార్గెట్‌గానే కేసీఆర్ ప్రతి సభలో విమర్శలు చేశారు. కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొని తెలంగాణపై పెత్తనం చేయడానికి వస్తున్నారని తీవ్ర స్థాయిలో సెంటిమెంట్ రగిల్చారు. అప్పుడు కూడా చంద్రాస్త్రంతోనే కేసీఆర్ పవర్‌లోకి వచ్చారు. అధికారం కోల్పోయి ఏడాదిన్నర అవుతున్న టైంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం వేదికగా కేసీఆర్ చంద్రబాబు అస్త్రాన్ని బయటకు తీశారు. తిరిగి ఎన్డీఏ పేరుతో చంద్రబాబు తెలంగాణలో రాజకీయాలు చేయనున్నారని ఇది తెలంగాణ ప్రాంతానికి నష్టం చేస్తోందని చెప్పేందుకు కేసీఆర్ విమర్శలు చేశారు. ఓవైపు చంద్రబాబు ఏపీ సీఎంగా ఉంటూ, తెలంగాణలో రాజకీయాల్లో కూడా అడుగుపెడితే తెలంగాణాకు అన్యాయం, ఏపీకి లాభం జరుగుతుందన్న లాజిక్‌ను వాడే ప్రయత్నం చేస్తున్నారు కేసీఆర్.ఎన్డీఏలో చక్రం తిప్పే పరిస్థితుల్లో ఉన్న చంద్రబాబు, తెలంగాణలోకి రానిస్తే కేంద్రం నుంచి వచ్చేవి రాకుండా అడ్డుపడే అవకాశం ఉంటుందని, గోదావరి, కృష్ణా జలాలను తరలించుకునే అవకాశం ఉందని అందుకే కేసీఆర్ ఈ వాఖ్యలు చేసినట్లు గులాబీ ముఖ్య నేతలు చెబుతున్నారు. చంద్రబాబు శిష్యుడైన రేవంత్ రెడ్డి ఇక్కడ సీఎంగా ఉండటంతో చంద్రబాబుకు అడ్డు లేకుండా పోతుందని అందుకే కేసీఆర్ ముందు చూపుతో చేసిన వ్యాఖ్యలగా బీఆర్ఎస్ నేతలు విశ్లేషిస్తున్నారు. ఎన్డీఏ పేరుతో తెలంగాణలోకి చంద్రబాబు రాకుండా చేసే ప్రచారం కేసీఆర్ చేపట్టే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రచారంతో తెలంగాణ ప్రజల్లో మరోసారి సెంటిమెంట్ రేకేత్తించవచ్చన్నది ఆయన వ్యూహంగా రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. 2014, 2018లో మెజార్టీ స్థానాలు బీఆర్ఎస్ గెలవడానికి కారణం తెలంగాణలో చంద్రబాబు ప్రచారం చేయడమే అన్న విశ్లేషణలు ఉన్నాయి. మళ్లీ ఇప్పుడు చంద్రబాబు తెలంగాణలో తిరిగితే అది కేసీఆర్‌కు ప్లస్ అవుతుందని రాజకీయ పరిశీలకుల అభిప్రాయం. ఇదే జరిగితే మళ్లీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అది కేసీఆర్‌కు సెంటిమెంట్ అస్త్రంగా మారనుందని అంటున్నారు. ఇదే వ్యూహంతో కేసీఆర్ చాలా ఆలోచించే ఈ వ్యాఖ్యలు చేసినట్లు చెబుతున్నారు.

# కులగణన(రీ)సర్వేలో పాల్గొని-సమాజ భవిష్యత్తు నిర్మాణం చేద్దాం

హైదరాబాద్ : జాతీయ బీసీ దళ్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ లోని మినిస్టర్ కోటర్స్ లో కులగణనపై అవగాహనకు సంబంధించిన టీ షర్ట్ లను లాంఛ్ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ గొప్ప పనికి శ్రీకారం చుట్టిన జాతీయ బీసీ దళ్, దుంద్ర కుమారస్వామిపై ప్రశంసలు కురిపించారు మంత్రి పొన్నం ప్రభాకర్.కులగణనకు సంబంధించి ఇంటింటి (రి)సర్వే లో పాల్గొనాలని ప్రజలను చైతన్య పరుస్తోంది జాతీయ బీసీ దళ్. ఇంతకు ముందు ఇంటింటి సర్వేలో పాల్గొనని వారి కోసం ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా రీ సర్వే ను ప్రారంభించింది. ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు వివరాల నమోదుకు అవకాశం కల్పించింది. ఇంతకు ముందు నిర్వహించిన సర్వేలో రాష్ట్రవ్యాప్తంగా 3.1 శాతం మంది వివరాలు నమోదు చేసుకోలేదు.వారికోసం ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించింది. టోల్ ఫ్రీ నెంబర్ 04021111 111 కూడా ఏర్పాటు చేసింది. ఆన్లైన్ ద్వారా లేదా మండల కార్యాలయంలో కూడా వివరాలు నమోదు చేసుకునే అవకాశాన్ని ఇచ్చింది. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. టీ షర్ట్స్ ద్వారా అవగాహన కల్పించాలని జాతీయ బీసీ దళ్ చేసిన ప్రయత్నం చాలా గొప్పది. ప్రజలలో మరింత అవగాహన కోసం లాభాపేక్ష లేకుండా జాతీయ బీసీ దళ్ చేస్తున్న ప్రయత్నాలు సంతోషాన్ని ఇస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రానికి చెందిన మేధావులు బీసీ వర్గాల నాయకులు అందరి విజ్ఞప్తి మేరకు కుల గణనలో నమోదు చేసుకొని వారికి మరో అవకాశం ఇవ్వడం జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇప్పటి వరకు కుల సర్వే లో పాల్గొనకుండా సమాచారం ఇవ్వని వారు ఎన్రోల్ చేసుకోవాలని.. మూడు పద్ధతుల్లో కుల సర్వే లో సమాచారం ఇవ్వడానికి అవకాశం ఇవ్వడం జరిగిందని, దయచేసి తెలంగాణ సమాజంలో కుల గణన సర్వేలో నమోదు చేసుకోని వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. జాతీయ బీసీ దళ్ అధ్యక్షులు దుంద్ర కుమారస్వామి మాట్లాడుతూ.. కులగణన భవిష్యత్ తరాలకు దిక్సూచిగా మారుతుందని అన్నారు. తెలంగాణలో కులగణన ఓ చారిత్రాత్మక నిర్ణయం. రాహుల్ గాంధీ కులగణన అంశానికి దేశవ్యాప్తంగా బ్రాండ్ అంబాసిడర్. తెలంగాణ కుల గణనను విజయవంతంగా పూర్తి చేసి వెనుకబడిన తరగతులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు న్యాయం చేశారు. కుల గణనలో బీసీ జనాభా లెక్కలు తీసుకుని వస్తామని కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్గాంధీ హామీని రేవంత్రెడ్డి నెరవేర్చారని, అసెంబ్లీలో నివేదికను ప్రవేశపెట్టి చరిత్ర సృష్టించారన్నారు.

# లిఫ్ట్‌లో ఇరుక్కున్న చిన్నారి మృతి

హైదరాబాద్ : రెండున్నర గంటల రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి ఆ బాలుడిని లిఫ్ట్ లో నుండి బయటకు తీశారు. కానీ మృతువు మాత్రం బాలుడిని వెంటాడి దరికి చేరింది. అభం శుభం తెలియని ఆ బాలుడు.. చికిత్స పొందుతూ శనివారం తుది శ్వాస విడిచాడు. ఈ ఘటన హైదరాబాద్ లోని మాసాబ్ ట్యాంక్ శాంతినగర్ లో జరిగింది.హైదరాబాద్ లోని మాసాబ్ ట్యాంక్ శాంతినగర్ లో ఆరేళ్ల బాలుడు లిఫ్ట్ లో ఇరుక్కున్న విషయం తెలిసిందే. ఆ బాలుడిని అగ్నిమాపక సిబ్బంది సుమారు రెండున్నర గంటలకు పైగా శ్రమించి, వైద్యశాలకు తరలించారు. అనంతరం వైద్యుల సలహా మేరకు కుటుంబ సభ్యులు నీలోఫర్ వైద్యశాలకు బాలుడిని తరలించి చికిత్స అందించారు.చికిత్స పొందుతున్న బాలుడు శనివారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆక్సిజన్ అందక బాలుడి అవయవాలు దెబ్బతినడంతో ఆరోగ్యం మరింతగా క్షీణించి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బాలుడు మృతి పై స్థానిక కార్పొరేటర్ ఖాసిం మాట్లాడుతూ.. బాలుడు లిఫ్ట్ లో చిక్కుకున్నట్లు సమాచారం అందుకున్న వెంటనే జీహెచ్ఎంసీ అధికారులను స్పాట్ కు పిలిపించామన్నారు. ఆ తర్వాత బాబును అతి కష్టం మీద బయటకు తీయడం జరిగిందన్నారు. అనంతరం వైద్యశాలకు తరలించగా, బాబును కాపాడే ప్రయత్నం చేశారని అయినప్పటికీ మృతి చెందడం, దురదృష్టకరమైన ఘటనగా కార్పొరేటర్ విచారం వ్యక్తం చేశారు. కాగా బాలుడు తన తాతతో కలిసి లిఫ్ట్ లో పైకి వస్తున్న క్రమంలో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. బాలుడి మృతి పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్త చేస్తున్నారు.మీ ఇంట్లో పిల్లలు ఉన్నారా.. అలాగే లిఫ్ట్ సౌకర్యం కూడా ఉందా? అయితే తస్మాత్ జాగ్రత్త అంటున్నారు అధికారులు. లిఫ్ట్ సౌకర్యం ఉన్న గృహాలలో చిన్నారుల కదలికలపై పెద్దల దృష్టి ఉండాల్సిన అవసరం ఉంది. చిన్నారులను లిఫ్ట్ లో తీసుకు వెళుతున్న క్రమంలో వారికి లిఫ్ట్ వైపుకు రాకూడదని సూచించాలి. అదే మాటలు అర్థం చేసుకొనే పిల్లలతో లిఫ్ట్ ఉపయోగించే విధానాన్ని వివరించాలి. ఇష్టారీతిన లిఫ్ట్ లో గల బటన్స్ ప్రెస్ చేయరాదని హెచ్చరించాలి. అంతేకాకుండా చిన్నారులు లిఫ్ట్ వైపు వెళ్లిన సమయంలో జరిగే అనర్థాల గురించి వారి మాటల్లోనే వివరించాలి.కొన్ని సార్లు లిఫ్ట్ లో ఉండి బయటకు వచ్చే తీరు తెలియక కూడా చిన్నారులు ఇబ్బంది పడతారు. అందుకు అర్థం చేసుకొనే వయస్సుకు చిన్నారులు వచ్చేంత వరకు వారిని లిఫ్ట్ వైపు పంపించరాదు. మనతో పాటు లిఫ్ట్ లో చిన్నారులు ఉన్నప్పుడు తప్పనిసరిగా ఒక చేతితో వారిని పట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేనియెడల లిఫ్ట్ లో ఏదైనా లోపం తలెత్తితే చిన్నారికి తీవ్ర గాయాలయ్యే అవకాశాలు ఉంటాయి.చాలా వరకు లిఫ్ట్ సౌకర్యం ఉన్న గృహాలలో పదే పదే చిన్నారుల ఆనందం కోసం లిఫ్ట్ లో రాకపోకలు సాగిస్తుంటాం. అలాంటి అలవాటుతో పెద్దల పర్యవేక్షణ లేని సమయంలో చిన్నారులు లిఫ్ట్ లోకి వెళ్లే ప్రమాదం పొంచి ఉంది. ఆటో మేటిక్ లిఫ్ట్ సౌకర్యం ఉన్న సమయంలో చిన్నారులు లిఫ్ట్ లో చిక్కుకున్నా అవి ఎక్కడో ఒక చోట ఆగిపోయే పరిస్థితి ఉంటుంది.

# హైడ్రాకు మరిన్ని పవర్ పోలీస్ స్టేషన్

హైదరాబాద్ : హైడ్రా గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. హైడ్రా పేరు వింటేనే అక్రమదారులు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే హైడ్రాకు ప్రభుత్వం రోజురోజుకీ మరింత బలాన్ని చేకూరుస్తోంది. ఆర్థికంగా ప్రభుత్వం ఫుల్ సపోర్టు చేస్తోంది. గతంలో హైడ్రాకు పోలీస్ స్టేషన్ కూడా అందుబాటులోకి రానుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. పోలీస్ స్టేషన్ ఏర్పాటు అయ్యాక హైడ్రాకు మరింత బలం చేకూరనుంది.మార్చి మొదటి వారంలో హైడ్రా పోలీస్ స్టేషన్ అందుబాటులోకి రానుంది. ఇప్పటికే హైడ్రా పోలీస్ స్టేషన్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. పోలీస్ స్టేషన్ కు సంబంధించిన అన్ని రకాల పనులు ఫిబ్రవరి చివరి వారంలోగా పూర్తి చేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. దీంతో పోలీస్ స్టేషన్ లో కావాల్సిన సిబ్బంది గురించి కమిషనర్ ప్రభుత్వానికి లేఖ రాశారు. కావాల్సిన సిబ్బందిని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.హైడ్రాకు ఒక పోలీస్ స్టేషనే కాక వెబ్ సైట్, మొబైల్ యాప్ కూడా అందుబాటులోకి రానున్నాయి. హైడ్రాకు సంబంధించిన వెబ్ సైట్ , మొబైల్ యాప్ కూడా రూపొందించేందుకు ఇప్పటికే అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే వీటికి సంబంధించిన పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయి. మొబైల్ యాప్ లో చెరువులు, కుంటలు, ఎఫ్టీఎల్, బఫర్ జోన్ ల వివరాలను తెలియజేయనున్నారు. దీంతో భాగ్యనగర వాసులకు ఎలాంటి స్థలం కొనాలో ఈజీగా తెలుసుకోవచ్చు. ఎక్కడ ల్యాండ్ కొనకూడదో తెలుసుకోవచ్చు. హైడ్రా పోలీస్ స్టేషన్, వెబ్ సైట్, యాప్ సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించాలని నిర్ణయించారు. మార్చి ఫస్ట్ వీక్ లో ఈ మూడు అందుబాటులోకి రానున్నట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు.హైడ్రా ప్రధాన కార్యాలయానికి పైగా ప్యాలెస్ ను కేటాయించిన విషయం అందరికీ తెలిసిందే. ఈ భవంతికి సంబంధించిన మరమ్మతులను హెచ్ఎండీఏ చేపడుతోంది. పైగా ప్యాలెస్ భవనానికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నిల్ కూడా ఇచ్చింది. అయితే, ఈ మరమ్మతుల పనులు అన్నీ పూర్తి కావడానికి సంవత్సర కాలం పట్టే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. అలాగే రీజనల్ అఫీసులను కూడా ఏర్పాటు చేయనున్నారు.

భాగ్యనగరానికి సంబంధించిన రీజినల్ కార్యాలయాన్ని బుద్ధ భవన్ లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రాచకొండకు సంబంధించిన రీజినల్ కార్యాలయాన్ని తార్నాకలోని పాత హెచ్ఎండీఏ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్నారు. సైబరాబాద్ కు సంబంధించిన రీజనల్ కార్యాలయాన్ని నానక్ రాం గూడలోని హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్(ఊఉఅఒ)లో ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే వీటి పనులు ప్రారంభమయ్యాయి.

# మళ్లీ దడ పుట్టిస్తున్న చైనా

బీజింగ్ : చైనా రూపొందించిన రోబో డాగ్, డ్రోన్ మధ్య పోరాట వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇప్పుడు చైనా సైన్యం చేసిన విన్యాసాలు దానికి మరింత ఊతం ఇచ్చాయి. గురువారం(ఫిబ్రవరి20) చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (ఖఒం) న్యూక్లియర్, బయోలాజికల్ అండ్ కెమికల్ డిఫెన్స్ డ్రిల్‌లో లు, రోబోటిక్ డాగ్‌లను ప్రదర్శించారు. చైనా ఇప్పుడు ఇలాంటి రోబోటిక్ కుక్కలపై దృష్టి సారించింది. రక్షణ రంగంలో ముందుకు సాగడంతో పాటు సైన్యాన్ని బలోపేతం చేసే దిశగా దీనిని ఒక పెద్ద అడుగుగా అభివర్ణిస్తున్నారు.రోబోటిక్ డాగ్‌లు శత్రువులను ఎదుర్కోవడానికి వ్యూహాన్ని మెరుగుపరుస్తాయి. సైనికుల బలిదాన ప్రమాదాన్ని తగ్గిస్తాయి. గత సంవత్సరం కూడా, చైనా తన సైన్యంలో భాగమైన రోబోటిక్ కుక్క లక్షణాలను పరిచయం చేసింది. అవి ఎలా పనిచేస్తాయో తెలుసా, చైనీయులకు ఎన్ని రకాల రోబోటిక్ కుక్కలు ఉన్నాయి, చైనా, కంబోడియా మధ్య ఉమ్మడి సైనిక విన్యాసాల వీడియో విడుదలైంది. రోబో డాగ్ సామర్థ్యాలను వీడియోలో చూపించారు. సరళంగా చెప్పాలంటే, శత్రువుల ఇళ్లలోకి ప్రవేశించి వారిపై దాడి చేయగల సైనికులకు ప్రత్యామ్నాయంగా రోబోట్ కుక్కలను తయారు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. నష్టం జరిగితే తక్కువగా ఉంటుంది. చైనా ఇప్పుడు టెక్నాలజీ సహాయంతో తన సైన్యాన్ని బలోపేతం చేసుకుంటోంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన మానవరహిత వైమానిక వాహనాలు, రోబోట్ కుక్కలు దీనికి ఉదాహరణలు.చైనా రోబో కుక్కలు నడవగలవు. పరుగెత్తవచ్చు. దూకవచ్చు, అడుగడుగునా అడుగులు వేయవచ్చు. అవసరమైనప్పుడు దూకవచ్చు కూడా. అవి అస్సాల్ట్ రైఫిళ్లను కూడా సమర్థవంతంగా నిర్వహిస్తారు. చైనా సైన్యంలో రెండు రకాల రోబో కుక్కలు ఉన్నాయి. మొదటి కుక్క మరింత శక్తివంతమైనది. దీనికి అస్సాల్ట్ రైఫిల్ అమర్చారు. 50 కిలోల బరువున్న ఈ కుక్క తన లక్ష్యాన్ని ట్రాక్ చేస్తున్నప్పుడు తన దిశను కూడా మార్చుకుంటుంది. దాని లక్ష్యం దాని స్థానాన్ని మారుస్తుందని అనుకుందాం. అప్పుడు అది తన స్థానాన్ని మార్చుకుంటూనే తన లక్ష్యాన్ని గురి చూస్తుంది. రెండవ రోబో కుక్క బరువు 15 కిలోలు. దీనిని శత్రువుపై నిఘా పెట్టడానికి, కొన్ని నిర్దిష్ట విషయాలను గుర్తించడానికి ఉపయోగించవచ్చు.ఈ రోబోటిక్ కుక్కలను చైనీస్ స్టార్టప్ కంపెనీ యూనిట్రీ రోబోటిక్స్ అభివృద్ధి చేసిందని అనేక మీడియా నివేదికలలో పేర్కొన్నారు. అయితే, ఆ కంపెనీ దానిని చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకి సరఫరా చేయడానికి నిరాకరించింది. ఈ రోబోటిక్ కుక్కలను ఎక్కడి నుండి తీసుకువస్తున్నారో చైనా సైన్యం కూడా స్పష్టం చేయలేదు.గత సంవత్సరం గోల్డెన్ డ్రాగన్ 2024 వ్యాయామంలో కూడా వీటిని ప్రదర్శించారు. ఈ సైనిక విన్యాసాలను చైనా, కంబోడియా సంయుక్తంగా 2024 మే 16 నుండి 30 వరకు నిర్వహించాయి. ఈ శిక్షణలో, చైనా సైన్యం తన బలాన్ని ప్రదర్శించింది. భూమిపై, ఆకాశంలో తన ఆధునిక ఆయుధాలను మోహరించింది. ఇప్పుడు మరోసారి చైనా రోబోటిక్ కుక్క వార్తల్లో నిలిచింది. గత నెలలో వైరల్ అయిన ఒక వీడియోలో, కుక్క డ్రోన్‌ను లక్ష్యంగా చేసుకుని దాడి చేస్తున్నట్లు కనిపించింది. ఈ వీడియోపై నెటిజన్లు రకరకాలుగా కామెంట్స్ చేస్తున్నారు.

# ఎల్ఆర్ఎస్‌పై రూల్స్... కండిషన్స్ అప్లై

హైదరాబాద్ : ఎల్ఆర్ఎస్ (లే అవుట్ల క్రమబద్ధీకరణ) దరఖాస్తులను పరిష్కరించే దిశగా తెలంగాణ సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. స్కీమ్ అమలులో వేగం పెంచేందుకు 25 శాతం రాయితీని ప్రకటించింది. 2020లో తీసుకువచ్చిన రూల్స్ కి కొన్ని సవరణలు చేసింది.

అవుట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇటీవలనే కీలక నిర్ణయం తీసుకోగా.. తాజాగా ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు కూడా జారీ చేసింది. క్రమబద్ధీకరణ ఫీజులో 25 శాతం రాయితీ ఇవ్వనుంది. అయితే మార్చి 31లోగా ప్రభుత్వం నిర్ణయించిన ఫీజును చెల్లించిన వారికి మాత్రమే ఈ రాయితీ నిర్ణయం వరిస్తుంది. ఇదే విషయాన్ని ఉత్తర్వుల్లో కూడా ప్రభుత్వం స్పష్టం చేసింది. గతంలో ఉన్న నిబంధనల్లో పలు మార్పులు తీసుకువచ్చింది.స్కీమ్ లో తీసుకువచ్చిన తాజా మార్పులతో చాలా మంది భూయాజమానులు తమ స్థలాలను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉంది. దీని ద్వారా ప్రభుత్వ ఖజానాకు భారీగానే ఆదాయం రానుంది. అయితే ఈ స్కీమ్ లో తాజాగా తీసుకువచ్చిన మార్పులు, కటాఫ్ తేదీ వివరాలకు సంబంధించిన ముఖ్యమైన విషయాలు ఇక్కడ చూడండి.. ఎల్ఆర్ఎస్ స్కీమ్ - 10 ముఖ్యమైన అంశాలు:ఎల్ఆర్ఎస్ స్కీమ్ 2020 ఏడాదిలో తీసుకొచ్చారు. ఇందుకోసం గ్రామాలు, పట్టణాల్లో భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఈ స్కీమ్ లో భాగంగా అక్రమ లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించారు. దరఖాస్తు ఫీజు కింద రూ. 1000 నిర్ణయించారు. ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి ప్రభుత్వానికి 25.67 లక్షల దరఖాస్తులు అందాయి. ఇందులో ప్లాట్లకు సంబంధించినవి 25.53 లక్షల దరఖాస్తులు కాగా, లేఅవుట్ల దరఖాస్తులు 0.13 లక్షలుగా ఉన్నాయి. ఇవన్నీ కూడా పెండింగ్ లో ఉన్నాయి.

ఎల్ఆర్ఎస్ స్కీమ్ విషయంలో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. దీంతో నాటి ప్రభుత్వం ముందుకు వెళ్లలేకపోయింది. దీంతో అప్పట్నుంచి నేటి వరకు కూడా ఈ దరఖాస్తుల విషయం పెండింగ్ లోనే ఉండిపోయింది. దరఖాస్తుదారులంతా క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం?. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై ఫోకస్ పెట్టింది. జిల్లాల వారీగా ప్రత్యేక డెస్క్ లను ఏర్పాటు చేసి? పరిష్కారం చేసే దిశగా ప్రయత్నాలు చేసింది. అయితే అనుకున్న స్థాయిలో స్పందన రాలేదు.

ఇటీవలే తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 10 శాతం ప్లాట్లు రిజిస్టరైన లేఅవుట్లలో మిగిలిన ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించాలని నిర్ణయించింది. మార్చి 31 లోపు క్రమబద్ధీకరణ ఫీజు చెల్లిస్తే 25 శాతం రాయితీ ఇస్తామని మంత్రుల బృందం



ప్రకటించింది. మంత్రుల బృందం ప్రకటన తర్వాత తాజాగా ఇందుకు సంబంధించి అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. 'తెలంగాణ రెగ్యూలరైజేషన్ ఆఫ్ అన్అప్రూవ్డ్ అండ్ ఇల్లీగల్ లేఅవుట్ రూల్స్ 2020కి సవరణలు చేస్తూ జీవో నెంబర్ 28ని విడుదల చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులను జారీ చేశారు.

ఈ జీవో వివరాల ప్రకారం లే ఔట్ల క్రమబద్ధీకరణ ఫీజులో 25 శాతం రాయితీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మార్చి 31లోగా ఫీజు చెల్లించిన వారికి ఈ రాయితీ వర్తిస్తుందని స్పష్టం చేసింది.

తాజా సవరణల ప్రకారం ఒఖీూ కటాఫ్ తేదీ (26.08.2020) నాటికి లేఔట్లలో కనీసమైనా 10 శాతం ప్లాట్లు విక్రయించి ఉండాలి. దీంతో మిగతా విక్రయించని ప్లాట్లను ప్రస్తుతం రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీలు ఉంటుంది.

ఈ లేఔట్లలో భూమిని కొనుగోలు చేసినవారు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ కు వెళ్లి వివరాలను సమర్పించవచ్చు. వీటిని ఎల్ఆర్ఎస్ పోర్టల్ కు అనుసంధానం చేస్తారు. ఇక్కడ క్రమబద్ధీకరణ చార్జీలతో పాటు ప్రోరేటా ఓపెన్ స్పేస్ చార్జీలు వసూలు చేసి రిజిస్ట్రేషన్‌కు అనుమతిస్తారు.

# భారీగా పెరిగిన ఎక్స్ చార్జీలు

హైదరాబాద్ : భారత ఎక్స్ యూజర్లకు ప్రపంచ కుబేరుడు ఎక్స్ సీఈవో ఎలాన్ మస్క్ పెద్ద షాక్ ఇచ్చాడు. ఎక్స్ ప్రీమియం + సబ్‌స్క్రిప్షన్ ధరలను భారత్‌లో భారీగా పెంచేశాడు. ఈ పెంపుతో గతంలో ఉన్న ధరలకు ఈ ధరలు రెంట్టిపు కానున్నాయి. మరోవైపు ఇప్పటికే ఒకసారి ఎక్స్ ప్రీమియం + చార్జీలను పెంచారు. మూడు నెలల వ్యవధిలో రెండోసారి చార్జీలు పెంచేశారు. మస్క్ తీరుపై ఎక్స్ యూజర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రోక్3 ఏఐ విడుదల తర్వాత ఎక్స్ ప్రీమియం + సబ్‌స్క్రిప్షన్ చార్జీలు పెంచడం గమనార్హం.మస్క్‌కు చెందిన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్సుకు సంబంధించిన స్టార్టప్ సంస్థ ఎక్స్ఏఐ తాజాగా గ్రోక్3 సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఇక ఈ ఎక్స్ఏఐని వినియోగించాలంటే ఎక్స్ ప్రీమియం ప్లస్ సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని గ్రోక్3 ప్రారంభించిన సమయంలోనే మస్క్ వెల్లడించాడు. ఈ నేపథ్యంలో తాజాగా ప్రీమియ్ + సబ్‌స్క్రిప్షన్ ధరలు పెంచేశారు.ఇప్పటి వరకు ఇండియాలో ప్రీమియమ్ + సబ్‌స్క్రిప్షన్ ధర నెలకు రూ.1,750గా ఉంది. తాజా పెంపుతో అది రూ.3,470కి చేరింది. అంటే ఈ ప్లాన్ ధరలు దాదాపు రెట్టింపు పెరిగాయి. ఇక ఏడాది మొత్తానికి తీసుకునే ప్లాన్ ధరను రూ.18,300 నుంచి రూ.34,340కి పెంచింది. అంటే ఈ ప్లాన్ ధరలు దాదాపు రెట్టింపయ్యాయి. అయితే ట్విట్టర్‌ను కొనుగోలు చేసిన ఎలాన్ మస్క్.. ఆ తర్వాత అందులో ఎన్నో సంచలన మార్పులు చేశారు. ఈ క్రమంలోనే ట్విట్టర్‌ను కొనుగోలు చేసిన వెంటనే దానిపేరు ఎక్స్ గామార్చేశారు. తర్వాత ఎక్స్‌నుంచి ఆదాయం సమకూర్చుకునేందుకు 2020 అక్టోబర్‌లోనే మొదటిసారి 6పీమియం + సబ్‌స్క్రిప్షన్‌ను ప్రవేశపెట్టారు. అయితే మొదట ప్రీమియం + ప్లాన్ ధర చాలా తక్కువగా నిర్ణయించారు. 2023 అక్టోబర్‌లో రూ.1,300గా ఉన్న ఎక్స్ ప్రీమియం + సబ్‌స్క్రిప్సన్ ధర.. ఆ తర్వాత 2024 డిసెంబర్‌లో రూ.1,750కి పెంచారు. తాజాగా మూడు నెలల వ్యవధిలోనే మరోమారు ప్లాన్ ధర పెంచారు. రూ.1,750 నుంచి ఒక్కసారి రూ.3,470కి పెంచడంతో యూజర్లపై భారం పడనుంది. అయితే ఎక్స్‌లో ఇతర ప్లాన్‌ల ధరలు మాత్రం పెంచకపోవడం ఊరటనిచ్చే అంశం. బేసిక్ సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ ధర ప్రస్తుతం నెలకు రూ.244గా నిర్ణయించారు. ఇక ప్రీమియం + సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ ధర నెలకు రూ.650గా ఉంది. యాడ్ ఫ్రీ ఎక్స్‌పీరియన్స్, సుదీర్ఘ పదాలు రాసే అవకాశం ఈ ప్రీమియం ప్లాన్ల ద్వారా ఎక్స్ యూజర్లకు లభిస్తుంది.

# కన్నవారిని విస్మరించే కారుణ్య ఉద్యోగులు జాగ్రత్త..

## - సీనియర్ సిటీజేన్స్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్

జగిత్యాల : కన్న తల్లి,దండ్రులను పోషించక నిరాధరిస్తున్న అనారోగ్య కారుణ్య నియామక పథకం కింద నియామకమైన కారుణ్య నియామక ఉద్యోగులైన కొడుకులు ,కూతుర్లు అనారోగ్య కారుణ్య నియామక పథకం రూల్స్ ప్రకారం సస్పెన్షన్ లేదా ఆ ఉద్యోగం నుంచి తొలగించ బడుతారని తెలంగాణ అల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ హెచ్చరించారు.. జిల్లా కేంద్రంలోని అసోసియేషన్ కార్యాలయం కౌన్సిలింగ్ కేంద్రం లో జిల్లాలోని కథలాపూర్, జగిత్యాల మండలాలకు చెందిన ఇద్దరు అనారోగ్య కారుణ్య నియామక ఉద్యోగులు వారి తల్లిదండ్రులను పోషించక పోవడంతో ఆ వృద్ధ తల్లిదండ్రుల అభ్యర్థన పై ఆ ఉద్యోగులను పిలిపించిన హరి ఆశోక్ కుమార్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ కౌన్సెలింగ్ కేంద్రంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. వారికి అనారోగ్య కారుణ్య నియామక పథకం రూల్స్ పై, వయోవృద్ధుల చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హరి ఆశోక్ కుమార్ మాట్లాడుతూ అనారోగ్యంతో వారి తల్లిదండ్రులు తమ కొడుకులకు,కూతుర్లకు అనారోగ్య కారుణ్య నియామక పథకం కింద తమ స్థానంలో ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తే ఆ తల్లిదండ్రులను జీవితాంతం ఆ ఉద్యోగం పొందిన వారు పోషించాల్సి ఉంటుందని,నిరదరిస్తే సంబంధించిన జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తే వారిని సస్పెండ్ ,ఉద్యోగం నుంచి తొలగించే అధికారం అనారోగ్య కారుణ్య నియామక పథకం రూల్స్ లో ఉందన్నారు. కౌన్సెలింగ్ కు స్పందించిన ఆ ఉద్యోగులు స్టాంపు పేపర్ పై తమ తల్లిదండ్రులను ఏ లోటు లేకుండా చూసుకుంటామని ఒప్పంద పత్రం రాసిచ్చారు ఈ కౌన్సెలింగ్ లో సీనియర్ సిటీజేన్స్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్,ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం,కౌన్సెలింగ్ ప్రతినిధులు పి.హన్మంత్ రెడ్డి,విఠల్ లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ పోలింగ్ సజావుగా నిర్వహించాలి

పెద్దపల్లి : ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సజా వుగా జరిగేలా అధికారులు విధులు నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. పెద్దపల్లిలో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మె ల్సీ స్థానాల ఎన్నికల పోలింగ్ కేంద్రాలను కలెక్టర్, సంబంధిత అధికా రులతో పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 27న ఉదయం 8 నుంచి సాయం త్రం 4 గంటల వరకు జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా గట్టి నిఘా పెట్టాలని, డబ్బు, మద్యం, ఇతర ఆభరణాలు పరికరాల ద్వారా ఓటర్లను ప్రభావితం చేయకుండా జాగ్రత్త పడాలని, క్షేత్రస్థాయి నుంచి వచ్చే సమాచారంతో ఎప్పటికప్పుడు దాడులు నిర్వహిస్తూ వీటిని నిరోధించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నిబం ధనలు తప్పకుండా పాటించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఆర్‌డీఓ బి గంగయ్య, సురేష్, ఏసీపీ కృష్ణ, సీఐ ప్రవీణ్ కుమార్, పెద్దపల్లి తహసిల్దార్ రాజయ్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సమస్యల పరిష్కారం

రామగిరి : కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సమస్యల పరిష్కారం అవుతుం దని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా సెంటినరీకాలనీ ఐఎన్‌టీయుసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లా డారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలపై అవగాహన ఉన్న అల్ఫోర్స్ కళాశాలల కరస్పాం డెంట్ నరేందర్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బలపర్చిందన్నారు. సింగరేణి అధికారులు, కార్మికు లు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ ఎస్ పదేళ్ళలో డీఎస్సీ, గ్రూప్-1 పోస్టుల ఉసే త్తలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం వచ్చిన సంవత్సరంలోనే న్యాయపరమైన చిక్కు లను పూర్తి చేసి 56 వేల ఉద్యోగాలు భర్తీ చేశామ న్నారు. సింగరేణిలో పెండింగ్‌లో ఉన్న క్లరికల్ ఉద్యోగావకాశాలను కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని పేర్కొన్నారు. గత ప్రభుత్వం చేసిన రూ.7 లక్షల కోట్ల అప్పులకు సంవత్సరానికి వడ్డీ రూ. 67 వేల కోట్లు చెల్లింపు చేస్తున్నామన్నారు. అప్పులు చెల్లిస్తూనే విద్య, వైద్యం, రైతుల సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రుణమాఫీతో పాటు సన్న రకాలకు బోనస్, రైతు భరోసా, ఇందిరమ్మ గృహాలకు చెల్లింపు చేసినట్లు తెలిపారు. ప్రైవెట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సింగరేణి కార్మికులతో పాటు కాంట్రాక్టు కార్మికులకు రూ.5వేల బోనస్ చెల్లించినట్లు పేర్కొ న్నారు. జీవో 317 ప్రకారం జోన్‌లుగా విభజించి ఉద్యోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేప ట్టినట్లు పేర్కొన్నారు. డీఎస్సీ 2014 కోర్టు నిర్ణయం మేరకు ఉద్యోగావకాశాలతోపాటు స్థానికంగా బదిలీ చేపట్టినట్లు పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్‌రెడ్డిని బలపర్చలని కోరారు. ఐఎన్‌టీయుసీ ఉపాధ్యక్షుడు నర్సింహ రెడ్డి, ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కొటరవీందర్‌రెడ్డి, నాయకులు బాపు, మైదం వరప్రసాద్, కొము రయ్యగౌడ్, బర్లశ్రీనివాస్, తులసిరాంగౌడ్, ఎల్లెరాం మూర్తి, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## చేనేత సహకార సంఘాలకు మళ్లీ ఇన్‌చార్జీలు

**- మరో ఆరు నెలల గడువు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు**

**- పర్సన్ ఇన్‌చార్జీలకు చేనేత సంఘాల బాధ్యతలు**

భూదాన్‌పోచంపల్లి : చేనేత సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జీలను మరో ఆరు నెలలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వు లు జారీ చేసింది. జిల్లాలో 2013 ఫిబ్రవరిలో చేనేత సహకార సంఘాలకు చివరి సారిగా ఎన్నికలు జరిగాయి. 2018 ఫిబ్రవరి 12వ తేదీతో ఈ పాలకవర్గాల ఐదేళ్ల గడువు ముగిసింది. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం తిరిగి ఎన్నికలు నిర్వహించకుండా పర్సన్ ఇన్‌చార్జీలను నియమించింది. పర్సన్ ఇన్‌చార్జీలతో సంఘాలు మొక్కుబడిగా నడుస్తుండగా, క్యాష్ క్రెడిట్ అంతంత మాత్రంగానే ఉన్నా ప లు సంఘాలు మూతపడే పరిస్థితికి చేరుకున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 84 సంఘాలు ఉండగా అందులో ఉత్సాహంగా పనిచేస్తున్న సంఘాలు పదికి మించి లేవు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తుందని ఆశపడిన చేనేత వర్గాలకు నిరాశే మిగిలింది. పర్సన్ ఇన్‌చార్జీల పాలనను మరో ఆరు నెలలు ఈ ఏడాది జూలై 20వతేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు లు జారీ చేసింది. చేనేత, మరమగ్గాలు, ఉన్ని పారిశ్రామిక సహకార సంఘాల పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహించి పుష్కర కాలం దాటింది. 2013 ఫిబ్రవరి 12నసంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. పాలకవర్గాల పదవీకాలం ముగియగానే ఎన్నికలు నిర్వహించకుండా ప్రతీ ఆరు నెలలకోసారి ప్రభుత్వాలు పర్సన్ ఇన్‌చార్జీల పాలనను పొడగిస్తూ వచ్చాయి. పర్సన్ ఇన్‌చార్జీల పా లన గతనెల 21న ముగియడంతో తిరిగి మరో ఆరు నె లలు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2018లో చేనేతసహకార సంఘాల పాలకవర్గాల గడువు ముగిసిన తర్వాత నియమించిన పర్సన్ ఇన్‌చార్జీల పద వీ కాలాన్ని ఇప్పటి వరకు 13 దఫాలు పొడిగించారు.

**ఎన్నికలు లేక సహకార సంఘాలు డీలా**

చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి బలోపేతం చేస్తే కార్మికులకు పని దొరుకుతుంది. మార్కెటింగ్ అవకాశాలు పెంపొంది కార్మికులకు గిట్టుబాటు లభిస్తుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చేనేత సహకార, పవర్‌లూమ్‌లు కలిపి మొత్తం 84 వరకు ఉన్నాయి. అందులో 25,900 మంది కార్మికులు ఉన్నారు. యాదాద్రి జిల్లాలో మొత్తం 44 చేనేత సంఘాలు ఉండగా ఏడు పవర్‌లూం సంఘాలు ఉన్నాయి. అందులో మొత్తం 18,852 మంది కార్మికులు ఉన్నారు. మగ్గం నేసే కార్మికులు 6,294 మంది ఉండగా, చేనేత అనుబంధ రంగంలో పనిచేస్తున్నవారు మరో 12,600 మంది వరకు ఉన్నారు. నల్లగొండ జిల్లాలో 25 చేనేత సహకార సంఘాలు, ఐదు పవర్‌లూం సంఘాలు ఉన్నాయి. అందులో సుమారు 6,580 మంది కార్మికులు ఉన్నారు. సూర్యాపేట జిల్లాలో మొత్తం మూడు చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. అందులో 320 మంది కార్మికులు పనిచేస్తున్నారు. మగ్గం నేసే కార్మికులు 110 మంది ఉండగా, అనుబంధ రంగంలో పనిచేసే కార్మికులు 210 మంది ఉన్నారు. సంఘాల్లో సభ్యత్వం ఉన్న వారందరికీ ప్రభుత్వం పాస్‌బుక్‌లు ఇచ్చి వాటి ఆధారంగా ఫొటోతో కూడిన ఓటర్ల జాబితాను సైతం రూపొందించింది. ఆ తరువాత ఎన్నికలు నిర్వహించకుండా ఇన్‌చార్జీల పాలనను మరో ఆరు నెలలు పొడిగించింది.

**ఇన్‌చార్జీల పాలనలో ఇష్టారాజ్యం**

చేనేత సంఘాలకు 12 ఏళ్లుగా ఎన్నికలు లేవు. గతంలో ఆప్కో ఉన్నప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రతీ మూడు నెలలకోసారి కొనుగోళ్లు జరిగేవి. కేవలం సహకార సంఘాల్లోనే ప్రొక్యూర్‌మెంట్ ఇచ్చేవారు. దీంతో చేనేత సంఘాలు ఆర్డర్‌పై కార్మికుల చేత వస్త్రాలు నేయించేవారు. క్యాష్ క్రెడిట్‌పై సంఘాలు బ్యాంకుల్లో రుణాలు తీసుకుని కార్మికులకు పని కల్పిస్తూ వస్త్ర ఉత్పత్తులను ఆప్కోకు విక్రయించేంది. వారు ప్రతీ ఆరు నెలలకోసారి కొనుగోలు చేసిన వస్త్రాలకు డబ్బు చెల్లించేవారు. తదుపరి ఆర్డర్ ఇచ్చి మళ్లీ ప్రొక్యూర్‌మెంట్ కల్పించేది. దీంతో సహకార సంఘాలు కార్మికులకు చేతినిండా పనికల్పిస్తూ ఉండేవి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లక్రితం టెస్కోను ఏర్పాటు చేసింది. ఎన్నికల నినాదంగా నామమాత్రంగా ప్రొక్యూర్‌మెంట్ ఇచ్చి సంఘాలకు ఆర్డర్ ఇచ్చినట్లు వ్యవహరించేది. దీంతో చేనేత సంఘాలన్నీ పనికల్పించలేని స్థితికి చేరుకున్నాయి. కొన్ని సంఘాల్లో వందలాది చీరలు మాయమయ్యాయి. చేనేత సంఘాల్లో పేరుకుపోయిన వస్త్రాలను కొనుగోలు చేయడంలో టెస్కో విఫలమైంది.

## రంజాన్ మాసం సందర్భంగా అన్ని సౌకర్యాలు కల్పించాలి

**- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



కరీంనగర్ : వచ్చే నెల 2 నుండి రంజాన్ మాసం ప్రారంభమవుతున్న దృశ్య జిల్లాలోని మసీదులు ఈద్గాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సంబంధిత అధికారులను ఆదేశించారు. రంజాన్ మాసం ఏర్పాట్లపై ముస్లిం మత పెద్దలు, సంబంధిత అధికారులతో కలెక్టర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ముస్లిములు సామూహిక నమాజ్ చేసే ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మసీదులో టెంట్ల ఏర్పాటు, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ సూచించారు. మసీదుల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, దోమల సమస్య రాకుండా ఫాగింగ్ చేయాలని కలెక్టర్ సూచించారు. పారిశుధ్య నిర్వహణకు ఒక నోడల్ అధికారిని నియమించాలని మున్సిపల్ కమిషనర్ కు సూచించారు. రంజాన్ పర్వదినం నేపథ్యంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని, వీధిలైట్లు మరమ్మతులు ఉన్నచోట కొత్తవి అమర్చాలని మున్సిపల్ కమిషనర్లకు కలెక్టర్ సూచించారు. ప్రార్థన ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని తెలిపారు. ప్రార్థన సమయాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఎలక్ట్రిసిటీ అధికారులను ఆదేశించారు. నగరంలో రద్దీ ఎక్కువగా ఉండే చోట ఉన్న ప్రార్థనా మందిరాల వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని ఏసీపీకి సూచించారు. మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్పేయి మాట్లాడుతూ అన్ని మసీదులు, ఈద్గాల వద్ద పారిశుధ్యం నిర్వహణకు జవాన్లను నియమిస్తామని తెలిపారు. రంజాన్ మాసంలో తాత్కాలిక స్టాళ్లు, దుకాణాలు ఏర్పాటు చేస్తే మున్సిపల్ అనుమతి తీసుకోవాలని కోరారు. తద్వారా అక్కడ సౌకర్యాలు కల్పించేలా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, ఆర్డిఓ మహేశ్వర్, మున్సిపల్, ట్రాఫిక్, పోలీస్, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై అక్రమ కేసులు పెడుతున్నారు

కుప్పం :కుప్పంలో పత్రికా స్వేచ్ఛ లేదు. జర్నలిస్టులపై ఆంక్షలు ఎక్కువగా వుంది.చైనాలో, రష్యాలో మాదిరిగా, కుప్పంలో అక్షరంపై ఆంక్షల విధించడాన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నానని మాజీ ఎంపి చింతా మోహన్ అన్నారు. .ముఖ్యమంత్రికి తెలిసి జరుగుతున్నదో, లేక తెలియక జరుగుతున్నదో నాకైతే తెలీదు. జర్నలిస్టుల పై అక్రమ కేసులు పెట్టుతున్నారు. పాత్రికేయులకు బెయిల్ ఇచ్చేందుకు ఎవరూ ముందుకురాలేంటా.ఒక లేడీ న్యాయవాది ముందుకొచ్చిందంటా. ఆమెను హృదయ పూర్వకంగా అభినందిస్తున్నాను.24 గంటల్లో పోలీసులు, కుప్పం పాత్రికేయులపై పెట్టిన అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాను. లేదంటే మళ్లీ కుప్పంకు వస్తా. రాజీవ్ గాంధీకి వ్యతిరేకంగా అప్పట్లో మీడియాలో కథనాలు వచ్చేవి. ఆయన చిరునవ్వు నవ్వి, స్వాగతించేవాడు. అలాగే పీవీ నరసింహారావు పై ఒక ఆంగ్ల పత్రికలో ప్రతి రోజూ కథనాలు రాసేవారు. లోపల బాధపడేవాడు. భయడపడేవారు కాదు. మనగురించి రాయకుంటే, ఇంకెవరి గురించి రాస్తారులే!? అని నాతో అనేవాడు. చంద్రబాబు నియోజకవర్గం కుప్పం ద్రవిడ యూనివర్సిటీలో పనిచేసే పని చేసే 200 మంది కార్మికులకు సంవత్సర కాలంగా జీతాలు ఇవ్వకపోవడం సిగ్గు చేటు.కుప్పంలో గంజాయి బాగా అమ్ముతున్నారని ప్రజలందరూ అనుకుంటున్నారు.శపుంకాలు పుంకాలుగా చెప్పుకుంటున్నారు. కుప్పం పోలీసులు గంజాయి అమ్మకాలను అరికట్టాలి. జర్నలిస్టులపై కేసులు ఆపాలి. రేషన్ బియ్యం కుప్పం నుంచి కర్నాటకకు, కర్ణాటక నుండి కుప్పానికి అక్రమ రవాణా అవుతోందంటా. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి రేషన్ బియ్యం అక్రమ రవాణా ఆపాలి. 660 గ్రానైట్ బ్లాక్సులు టిడిపి వారు ఎత్తుకెళ్లి ఆరు కోట్లకు అమ్ముకున్నారంటా. వీటిపై విచారణ జరపాలని కోరుతున్నాను.కుప్పంలో చెరువులు కబ్జా అవుతున్నాయి. వీటిపై రెవిన్యూ, పోలీసులు దృష్టి పెట్టాలని అన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా సుప్రీంకోర్టు ఒక పిచ్చి ఉంది. దాన్ని ఆధారంగా చంద్రబాబు మిశ్రా కమిషన్ వేసి, గ్రామాల్లో తిప్పి, మాల మాదిగల మధ్య చిచ్చు పెట్టుతున్నాడు. మిశ్రా కమిషన్ రద్దు చేయాలి డిమాండ్ చేస్తున్నాను. జాతీయ బ్యాంకుల దేశ సంపదలో వర్గీకరణ కావాలి. అంఖీఆ కాంట్రాక్టుల్లో వర్గీకరణ జరగాలి. కాంటాక్ట్ పనులన్నీ చంద్రబాబు మనకు కావాల్సిన వారికే కట్టబెడుతున్నారు. ఎస్సీ, ఓబీసీలకు కాంట్రాక్టులు ఇవ్వడం లేదు. పై వర్గాలు ఆర్థికంగా పైకి రావాలంటే, ఆసుపత్రులు, మరియు పారిశుద్ధ్య విభాగంలో కాంట్రాక్టులు పనులు ఇవ్వాలి.దేశ సంపదంతా మార్వాడీలు, గుజరాతీలే తీసుకుంటున్నారు. 25% ఎస్సీ, ఎస్టీలు ఉంటే, ఒక్క శాతంలోపు రుణాలు ఇస్తున్నారు. 50 శాతం జనాభా వున్న ఓబీసీలకు 2% లోపు బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయి. 75 శాతం అప్పులు గుజరాతీలు, మార్వాడీలే తీసుకుంటున్నారు.కర్నూలు నుంచి, ప్రకాశం జిల్లా వరకు, శ్రీకాకుళం, విజయనగరం, రాజమండ్రి వరకు దాదాపు 15 జిల్లాల్లో అభివృద్ధే కనిపించలేదు. పూర్తిగా ఆగిపోయింది.వెనుకబడిన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి, ఒక్కో జిల్లాకు 3 వేల కోట్లు రూపాయలు ఇవ్వాలి.రాయలసీమ ప్రాంతాల నుంచే దాదాపు 50 సంవత్సరాలు ముఖ్యమంత్రులు పరిపాలించారు. తమ సొంత ప్రాంతాలకు ఏమి చేశారు? 14 సంవత్సరాలు సీయంగా పని చేసిన, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్తూరు జిల్లాకు ఏం చేశాడని సూటిగా ప్రశ్నిస్తున్నానని అన్నారు.

## సజ్జనార్ సార్... సారీ... ఇంకెప్పుడు చేయను

హైదరాబాద్ : నాని సారీ చెప్పాడు. ఇకపై అలాంటి పనులు చేయనంటూ ప్రామిస్ కూడా చేశాడు. అంతేకాదు తన ఫాలోవర్స్ తో పాటు, తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ కు సైతం తనను క్షమించాలని వేడుకున్నాడు. అసలేం జరిగిందంటే..సీనియర్ ఐపీఎస్ అధికారి, తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తన ట్విట్టర్ ఖాతా ద్వారా బెట్టింగ్ యాప్ లను ప్రమోట్ చేస్తున్న వారి భరతం పడుతున్న విషయం తెలిసిందే. తక్కువ కాలంలో డబ్బులు సంపాదించవచ్చని పలువురు సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్న నేపథ్యంలో, అమాయకులైన ప్రజలను అప్రమత్తం చేసేందుకు సజ్జనార్ పలు వీడియోలను పోస్ట్ చేస్తున్నారు. ఎందరో ఆన్లైన్ బెట్టింగ్ యాప్ ల దారుణాలకు బలైన ఘటనలు సైతం ఉన్నాయి. అటువంటి వారిని అప్రమత్తం చేసేందుకు సజ్జనార్ బెట్టింగ్ యాప్ లను ప్రమోట్ చేస్తున్న వారిని పలుమార్లు హెచ్చరించారు.ఈ నేపథ్యంలోనే బెట్టింగ్ యాప్ లను ప్రమోట్ చేస్తున్న ఇన్‌ఫ్లూయెన్సర్ల వీడియోలను పోస్ట్ చేస్తూ ఇటువంటి ప్రకటనల పట్ల తస్మాత్ జాగ్రత్త అంటూ సజ్జనార్ ప్రజలను చైతన్య పరుస్తున్నారు. తాజాగా వైజాగ్ కు చెందిన మత్స్యకారుడు నాని విడుదల చేసిన ఓ బెట్టింగ్ ప్రమోషన్ కు చెందిన వీడియోను ఆయన ఎక్స్ ఖాతా ద్వారా ట్వీట్ చేశారు. ఇలాంటి మోసాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దీనితో వైజాగ్ నానికి పలువురు బ్యాడ్ కామెంట్స్ చేయడంతో పాటు, ఇటువంటి వాటిని ప్రచారం చేసి యువతను దెబ్బతీయొద్దంటూ కోరారు.సజ్జనార్ లాంటి పోలీసు అధికారి వీడియో పోస్ట్ చేయడంతో నానిపై నెటిజన్ల నుండి విమర్శల వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో నాని ఓ వీడియోని విడుదల చేశాడు. బెట్టింగ్ యాప్ లను ప్రమోషన్ చేసి తాను తప్పు చేశానని నాని ఒప్పుకున్నాడు. తాను చదువుకోలేదని, ఉన్నత చదువులు చదివిన వారు కూడా ప్రమోట్ చేసే విధానం చూసి మోస పోయానన్నాడు. ఇలాంటి ప్రమోషన్స్ చేయడాన్ని తాను తప్పుగా భావిస్తున్నట్లు వీడియో విడుదల చేశాడు. ఇకనుండి బెట్టింగ్ యాప్ లను ప్రమోట్ చేయనని చెప్పుకొచ్చాడు.తనను ఫాలో అవుతున్న ఫాలోవర్స్ ను మోసం చేయడం తప్పుగా భావించానని, సరైన సమయంలో పోలీస్ అధికారి సజ్జనార్, తనను అప్రమత్తం చేశారని నాని అన్నాడు. ఎంతో మంది అమాయకుల ప్రాణాలను బలి తీసుకుంటున్న ఆన్లైన్ బెట్టింగ్ యాప్లను ఇక నుండి తాను ప్రమోట్ చేయనని ప్రకటించాడు.

అంతేకాకుండా సోషల్ మీడియా ఫాలోవర్స్ కు సారీ చెబుతూ నాని ఆవేదనకు గురయ్యాడు. నాని విడుదల చేసిన వీడియోను సజ్జనార్ పోస్ట్ చేసి బెట్టింగ్ యాప్ ల ప్రమోషన్ చేయనంటూ ప్రకటించడంపై అభినందిస్తూ.. మిగిలిన సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు మారకుంటే చట్ట ప్రకారం చర్యలు తప్పవని సజ్జనార్ హెచ్చరించారు. ఎందరో అమాయకులు బెట్టింగ్ యాప్ లకు బలవుతున్న పరిస్థితులలో, సజ్జనార్ స్పందిస్తూ.. యువతను చైతన్య పరచడంపై నెటిజన్స్ అభినందనలు తెలుపుతున్నారు.

## పద కవితా పితామహుడు, వాగ్గేయకారుడు తాళ్ళపాక అన్నమయ్య

**-వేంకటేశ్వరస్వామి ని కీర్తిస్తూ 32వేలకు పైగా కీర్తనలు రచించిన అన్నమయ్య**

అన్నమయ్య లేదా తాళ్ళపాక అన్నమాచార్యులు వైశాఖమాసం విశాఖ నక్షత్రంలో ఒక శుభలగ్నంలో మూడు గ్రహాలు ఉన్నత దశలో వుండగా నారాయణసూరి, లక్కమాంబలకు నందకాంశమున పుత్రోదయమైనది, మగశిశువు గా ఉదయించాడు. సర్వధారి సంవత్సరం వైశాఖ శుద్ధ పూర్ణిమ నాడు (మే 9, 1408) కడప జిల్లా లోని రాజంపేట మండలం తాళ్ళపాక గ్రామములో అన్నమయ్య జన్మించాడు. 8వ యేట అన్నమయ్యకు ఆయన గురువు ఘనవిష్ణు దీక్షనొసగినపుడు అన్నమాచార్య నామం స్థిరపడింది. నారాయణసూరి ఆ శిశువునకు ఆగమోక్తంగా జాతకర్మ చేశాడు. అన్నమాచార్య తెలుగు సాహితీ చరిత్రలో లభించిన ఆధారాల ప్రకారం మొదటి వాగ్గేయకారుడు (సాధారణ భాషలో గేయాలను కూర్చేవారు). అన్నమయ్యకు పదకవితా పితామహుడు అని బిరుదు ఉన్నది. దక్షిణాపథంలో భజన సాంప్రదాయానికి, పదకవితాశైలికి ఆద్యుడు. గొప్ప వైష్ణవ భక్తుడు. తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి ని, అహోబిలము లోని నరసింహ స్వామి ని, ఇతర వైష్ణవ సంప్రదాయ దేవతలను కీర్తిస్తూ 32వేలకు పైగా కీర్తనలు రచించాడు. అన్నమయ్య పాటలు, పదాలు, పద్యాలలో భక్తి, సాహిత్యం, సంగీతం, శృంగారం, భావలాలిత్యం పెనవేసికొని ఉంటాయి. కన్నడ వాగ్గేయకారుడు పురందరదాసు అన్నమయ్యను శ్రీనివాసుని అవతారంగా ప్రశంసించాడంటారు. (సాక్షాత్తు శ్రీమహావిష్ణువు ఖడ్గమైన నందకం అంశతో అన్నమయ్య జన్మించాడని శ్రీవైష్ణవసంప్రదాయంలో నమ్మకం ఉన్నది. ప్రధాన మందిరంలో ఘంట అవతారమని కూడా అంటారు). త్యాగయ్య, క్షేత్రయ్య, రామదాసు వంటి సంకీర్తనాచార్యులకు అన్నమయ్య మార్గదర్శకుడు. చందమామ రావే జాబిల్లి రావే అంటే వేంకటేశుడు ముద్దలు తిన్నాడో తినలేదో కానీ, తెలుగు పిల్లలు మాత్రము గబుక్కున తింటారు. జోఅచ్యుతానంద జో జో ముకుందా అంటే ముకుందుడు నిద్ర పోతాడో లేదో కానీ తెలుగు పిల్లలు మాత్రము హాయిగా నిద్ర పోతారు. అన్నమయ్య పాటలు తెలుగు సంస్కృతికి ప్రతిరూపాలు. అవి తెలుగు సంస్కృతిలో ఒక భాగమై పోయినాయి; జనాల నోళ్ళలో నాటుకొని పోయినాయి. తుమ్మెద పాటలు, గొబ్బిళ్ళ పాటలు, శృంగార గీతాలు, ఆధ్యాత్మిక పదాలు - ఇలా మొత్తము ముప్పై రెండు వేల పాటలు వ్రాసాడు. 95 సంవత్సరాలు పరిపూర్ణ జీవితం గడిపిన అన్నమయ్య దుందుభి నామ సంవత్సరం ఫల్గుణ బహుళ ద్వాదశి నాడు (1503 ఫిబ్రవరి 23) పరమపదించాడు.

## బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్లో నష్టపోతున్న కోళ్ల ఫారం రైతులు

కోదాడ : అనంతగిరి మండలం కిష్టాపురం గ్రామంలో కోళ్ల పారంలో కోళ్లకు దాన వేయకపోవడంతో పది వెయ్యిల కోళ్ల మృతి చెందాయి. దాంతో కోళ్ల ఫారం రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ వైరస్ కోళ్ళకు సోకడంతో కోళ్ల వ్యాపారంలో నష్టాలు వస్తున్నాయి. పెట్టుబడులకి డబ్బులు లేకపోవడంతో ఫారంలు వదిలివేస్తున్నారు. 15 లక్షల వరకు నష్టం వాటిల్లిందని అంటున్నారు. జేసీబీ సహాయంతో గుంతను తీసి...మృతి చెందిన కోళ్లను పుడుస్తున్నారు.

## టమోటా రైతులకు భరోసా కార్యక్రమం

తుగ్గలి: టమోటా సాగు చేసిన రైతులకు ఆర్థిక భరోసాను కల్పిస్తున్నట్లు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు తెలియజేశారు. శనివారం రోజున తుగ్గలి మండల పరిధిలోని గల రాతన గ్రామ సమీపంలో కురువ గోపాల్ టమోటా పంటలు పరిశీలించి గిట్టుబాటు ధర కల్పిస్తామని వారు తెలియజేశారు.కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతులకు అండగా ఉంటుందని వారు తెలియజేశారు.కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను తప్పక నెరవేరుస్తారని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తెలుగు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రాతన మనోహర్ చౌదరి, తుగ్గలి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తిరుపాల్ నాయుడు, తుగ్గలి మండల మండల పరిషత్ మాజీ అధ్యక్షులు కొమ్ము వెంకటేష్,మాజీ ఉపాధ్యక్షులు బి చంద్రశేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ వెంకటస్వామి,రాతన కృష్ణమూర్తి చౌదరి,బీసీ సెల్ మండల అధ్యక్షులు సంఘాల కృష్ణ,గిరిగెట్ల మల్లికార్జున,జొన్నగిరి జయరాముడు, మాజీ ఎంపీటీసీ వల్లే వెంకటేష్,కృష్ణ, రైతు సంఘం మండల అధ్యక్షులు రాతన మైరాముడు,ఆవుల కృష్ణమూర్తి, రైతు సంఘం తాలూకా కార్యవర్గ సభ్యుడు కొత్తూరు చక్రపాణి,ఆవుల వీరాంజనేయులు,దడిపినేని రమేష్, బంగి వీరాంజనేయులు,గిరిగెట్ల బోల రంగస్వామి,శర్మాస్ వలి తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో రోజు రోజుకీ కొత్త మోసాలు

హైదరాబాద్ : హైదరాబాద్ లో రోజు రోజుకీ కొత్త మోసాలు బయటపడుతున్నాయి. ఎవరూ అమాయకంగా కనిపిస్తారో వారిని ఇట్టే మోసం చేస్తారు. భాగ్యనగరంలో రకరకాల మోసాలు చూస్తుంటాం. ఆన్ లైన్ లో మోసాలు, ఫ్లిప్ కార్ట్, అమెజాన్ పేరు వాడుకుని చాలా రకాలుగా ప్రజలను మోసం చేస్తుంటారు. తాజాగా ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తున్న వారిని మై ఫ్రూట్ బాక్స్ పేరుతో మోసం చేసిన ఘటన హైదరాబాద్, బోరబండలో చోటుచేసుకుందిమార్నింగ్ బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్నం లంచ్, రాత్రి డిన్నర్ కు వివిధ పండ్లను సప్లై చేస్తామని ఆన్ లైన్ లో ప్రమోషన్ కూడా చేయించారు. ఫ్రూట్ బౌల్ కు రూ.3000, మినీ ఫ్రూట్ బౌల్ కు రూ.1500 వరకు ఛార్జ్ చేస్తున్నారు. డబ్బులచెల్లించిన తర్వాత ఫ్రూట్ డెలివరీ చేయకుండా ముఖం చాటేస్తున్నారు. ఇప్పటికే ఇలా చాలా మంది మోసపోయారు.కాల్ చేస్తే లిఫ్ట్ చేయడం లేదన్న కస్టమర్స్ లబోదిబోమంటున్నారు. ఆఫీస్ కు వెళ్లి అడిగితే కేసు పెడుతున్నారని కస్టమర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మై ఫ్రూట్ బాక్స్ వల్ల 1600 మందికి పైనే మోసపోయారని తెలుస్తోంది. మై ఫ్రూట్ బాక్స్ నడిపే వారిని కఠినంగా శిక్షించాలని కస్టమర్స్ అధికారులను వేడుకుంటున్నారు.బోరబండ, శ్రీనగర్ కాలనీలో ఓ కస్టమర్ మోసపోయాడు. ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్, యూట్యూబ్ లల్లో చూసి తాము ఆర్డర్ పెట్టామని వాపోయాడు. ఆర్డర్ పెట్టి వారం రోజులు అవుతుందని.. డబ్బులు చెల్లించే వరకు స్పందించారని.. చెల్లించాక వాళ్ళు అందుబాటులో లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్ స్టాగ్రామ్ చూసి రూ.3000 డబ్బులు పే చేశానని మరో బాధితుడు వాపోయాడు. ఆ తర్వాత డబ్బులే చెల్లించలేదని.. కనీసం అందుబాటులో లేరని బాధిత వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశాడు. వారికి వందల సార్లు ఫోన్ చేశామని అయినప్పటికీ స్పందించలేదని వాపోయారు.

## గోవుల అక్రమ తరలింపు-సదాశివపేటలో అడ్డగింత

సదాశివపేట : గోవధ నిషేధ చట్టం ఉన్నప్పటికీకొంతమంది అడ్డదారిలో గోవులను కబేళాలకు తరలిస్తున్నారని నూకవరపురామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు.అక్రమంగా తరలిస్తున్న ఆవులను సదాశివపేటలో పట్టుకోవడం జరిగిందన్నారు. లారీ ద్వారా అక్రమంగాతరలిస్తున్న గోవుల మంద పట్టుకుని వివరణ అడగగా తాము ఆవులను కొని జహీరాబాద్ లో అమ్మడానికివెళ్తున్నామని అబద్ధాలు చెప్పడంజరిగిందన్నారు. గోవుల మంద లో 15 లేగ దూడలు, 2 పెద్దఆవులు ఉన్నాయన్నారు.వెంటనే వారి నుండి ఆవులను తీసుకొని సంగారెడ్డి లో ఉన్న గోపాల గోశాలలో చేర్పించడం జరిగిందని నూకవరపురామకృష్ణ తెలిపారు.గోగుల సంరక్షణకై 10 వేల రూ. లను రామకృష్ణ అందించి గోవుల పట్ల భక్తిని చాటారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇలా గోవులనుచంపుకుంటూ పోతుంటే గోవులు వాటి తరం అంతరించిపోతుందని ఆవేదనవ్యక్తంచేశాడు. హిందువులు గోవునుదైవసమానంగా భావిస్తారని ప్రతి హిందువు గోవులనుకాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశాడు.

## వత్తాసు పలకడం సరికాదు..

సిరిసిల్ల : వస్త్ర పరిశ్రమ ఐక్య వేదిక కన్వీ నర్‌గా ఉన్న తాటిపాముల దామోదర్ ఒక పార్టీకి వత్తాసు పలుకుతున్నాడని, అది సరికాదని బీఆర్‌ఎస్ సిరిసిల్ల పట్ట ణ అధ్యక్షుడు జిందం చక్రపాణి అన్నారు. సిరిసిల్ల పట్టణం అంబే ద్కర్ చౌరస్తా వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి చక్రపాణి నాయ కులు పూలమాలలు వేసి వినతిపత్రం ను సమర్పించారు.అనంతరం కాంగ్రెస్ నాయకులు, వస్త్ర పరిశ్రమ ఐక్య వేధిక కన్వీనర్‌కు సవాలు విసిరినట్టే అంబేద్కర్ విగ్రహం ఎదుట బహిరంగ చర్చకు కూర్చున్నారు. దాదాపు అరగం ట వరకు వేచిచూసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఐక్య వేదిక కన్వీనర్ రాలేదు. ఈ సందర్భంగా చక్ర పాణి మాట్లాడుతూ ఐక్య వేదిక కన్వీనర్ మొన్నటి రోజు తనపై వ్యక్తిగతంగా దూషణలు చేశాడని ఆరోపించారు. బతుకమ్మ చీరల ఆర్డర్లలో రూ.3 కోట్ల పనులను చేసినానని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రూ.2కోట్లు ఇచ్చిందని ఆరోపణలు చేశార న్నారు.దీనిపై అంబేద్కర్ విగ్రహం వద్ద బహిరంగ చర్చకు వచ్చానన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని యజమానులు, ఆసాములు, కార్మికుల పక్షాన తాను మాట్లాడానని తెలిపారు. బతుకమ్మ చీరల బకాయిల బిల్లులు రూ.50శాతం ఉన్నాయని వాటి ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అర్బన్ బ్యాంక్ చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్‌చైర్మన్ అడగ ట్ల మురళి, బీఆర్‌ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్య క్షుడు వెంగళ శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు అన్నారం శ్రీనివాస్, దార్ల సందీప్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సబ్బని హరీష్, బీఆర్‌ఎస్ పట్టణ నాయకులు భాస్కర్, శంకర్, బాలయ్య ఉన్నారు.

## బాల్య వివాహాలు చేయడం నేరం

**- జిల్లా బాలల సంరక్షణాధికారి మహేష్**

ఆసిఫాబాద్ : బాల్య వివాహాలను చేయడం చట్ట రీత్యా నేరమని అందుకు రెండు సంవత్సరాల శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధించడం జరుగుతుందని జిల్లా బాలల సంవరక్షణ అధికారి మహేష్ అన్నారు. రెబ్బెన మండలం వంకులం గ్రామానికి చెందిన మైనర్ అమ్మాయిని జిల్లా కేంద్రంలోని రాజంపేటకు చెంది న అబ్బాయితో ఆదివారం వివాహం జరగాల్సిన ఉండగా 1098 టోల్‌ఫ్రీ నంబరుకు అందిన సమా చారం వచ్చిన మేరకు బాల రక్షణ భవన్ సిబ్బంది వెళ్లి వాహనాన్ని అడ్డుకున్నారన్నారు. వివాహం జరగాల్సిన మైనర్ బాలికను ఆసిఫాబాద్ సఖి కేంద్రానికి తరలించి ఇరు కుటుంబసభ్యులకు, కుల పెద్దలను పిలిపించి సోమవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం బాల్య వివాహాల ద్వారా ఎదురయ్యే ఆరోగ్య, మానసిక సమస్యలను వివరిం చారు. ఈ సందర్భంగా డీసీపీవో మాట్లాడుతూ చిన్న వయస్సులో ఆడ పిల్లలకు పెళ్ళిళ్లు చేసి వారి బంగారు భవిష్యత్‌ను పాడు చేయవద్దని సూచించా రు. ప్రభుత్వం బాలికల విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు. ఆడ పిల్లలను చదివించి 18 సంవత్సరాల వయస్సు నిండిన తరువాతనే వివాహాలు చేయాల ని సూచించారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



## మహాశివరాత్రి ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

**వేద న్యూస్ శాయంపేట:**

శాయంపేట మండల కేంద్రంలోని అతి పురాతనమైన ఆరు శతాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాల కరపత్రాలను దేవాలయ ఆవరణలో దేవాలయ చైర్మన్ సామల బిక్షపతి ఆవిష్కరించినారు. ఈ సందర్భంగా దేవాలయ చైర్మన్ సామల బిక్షపతి మాట్లాడుతూ మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుటకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఉదయం ఐదు గంటలకు సుప్రభాత సేవ ప్రధమ రుద్రాభిషేకం, ఆరు గంటల నుండి రాత్రి 9 గంటల వరకు అర్చనలు అభిషేక పూజలు ,రాత్రి 9:30 కు శివపార్వతుల కళ్యాణం , రాత్రి 12 గంటలకు లింగోద్భావ పూజ అష్టోత్తర శత బిల్వార్చన నీరాజనం మంత్రపుష్పం పూజలు జరుగుతాయని చైర్మన్ సామల బిక్షపతి తెలిపారు .ఈ కార్యక్రమంలో దేవాలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచారి ,మార్త సుమన్, కొలగాని శ్రీనివాస్, కోమటి గణేష్ ,నీల కోమల్ రెడ్డి పాల్గొన్నారు.

## జర్నలిస్ట్‌ల సమస్యలు పరిష్కరించాలి

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**




జర్నలిస్టుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.గత కొన్ని సంవత్సరాలుగా జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు, అక్రెడిటేషన్ కార్డులు,హెల్త్ కార్డులు, పెన్షన్ స్కీం, దాడుల నివారణకు ప్రత్యేక కమిటీల ఏర్పాటు, చిన్న, మధ్య తరహా పత్రికలకు ప్రభుత్వ గుర్తింపు, జర్నలిస్టుల ప్రత్యేక రక్షణ చట్టం డిమాండ్ల కోసం వారు చేయని ప్రయత్నమంటూ లేదు.అన్ని రాజకీయ పార్టీలు రేపు మాపు అని చెప్పి చేతులు దులుపుకుంటున్నాయని అన్నారు.ఈ రాష్ట్ర ప్రభుత్వం అయినా వారి యొక్క సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డికి బీసీ సంక్షేమ సంఘం ద్వారా విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.తాము అధికారంలోకి రాగానే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలిస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపి జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు.

## దడ పుట్టిస్తున్న కుక్కలు..!

- **పాఠశాలల్లో కుక్కల బెడద**
- **తల్లిదండ్రులపై దాడి**
- **భయాందోళనలో విద్యార్థులు**

**వేద న్యూస్, మరిపెడ :**



మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని సీతారాంపురం స్కూల్లో వీధికుక్కల భయం ఎక్కువైంది. సీతారాం పురం స్కూల్‌కు పని నిమిత్తం ఇద్దరు వ్యక్తులు వెళ్లగా అక్కడే ఉన్న వీధి కుక్క వారిపై దాడి చేసి గాయపరిచింది. కాగా ఆ వ్యక్తులు స్కూల్ ప్రధానోపాధ్యాయులను ప్రశ్నించగా నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చారని ఆ వ్యక్తులు ఆరోపించారు.కాగా స్కూల్లో వీధి కుక్కలు బెడదతో భయాందోళనలకు గురవుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి స్కూల్లో వీధి కుక్కలను లోనికి రాకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## కదంతొక్కిన కలం కార్మికులు

**మొదటి పేజీ తరువాయి**



కోరారు. ప్రధానంగా ఇళ్ల స్థలాలు, కొత్త అక్రెడిటేషన్ కార్డులు, చిన్న, మధ్య తరహా పత్రికలకు ఎంపానెల్మెంట్ తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య మాట్లాడుతూ, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని, హెల్త్ కార్డులు లేక, వైద్య సదుపాయాలు అందక రాష్ట్రవ్యాప్తంగా దాదాపు ఐదు వందల మంది జర్నలిస్టులు చనిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు వెంటనే ప్రత్యామ్నాయ మార్గాల్లో ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, ఆరోగ్య భీమా పథకం, పెన్షన్ స్కీం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమాచార పౌరసంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ జగన్ కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ప్రతినిధి బృందం సచివాలయంలో రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ కమీషనర్ ఎస్. హరీష్ ను కలిసి వినతి పత్రం సమర్పించి సమస్యలను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లి రాంచందర్, గుడిగ రఘు, కార్యదర్శులు ఎస్ కె సలీమా, కార్యవర్గ సభ్యులు కె. పాండురంగారావు, పి.నాగవాణి, మణిమాల,నాయకులు యర్రమిల్లి రామారావు, శ్రీనివాస్ గౌడ్,రవికుమార్, సీహెచ్ రంగయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రానికి అనారోగ్యం..!

**మొదటి పేజీ తరువాయి**

రోగులకు కాకుండా తమ సొంత పనులకు వాడుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పారిశుద్ధ్య నిర్వహణ లోపాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. మరుగుదొడ్లను చూస్తే వాంతులు వచ్చేలా ఉందని అసలు అటువైపుగా నడవాలి అన్న రోగులు, రోగుల బంధువులు జంకుతున్నారు. రోగులకు రోగం నయమవ్వడం ఏమో కానీ లేని రోగాలు వచ్చేలా ఉన్నాయని పలువురు మండిపడుతున్నారు. ఆసుపత్రికి సంబంధించిన అన్ని రకాల నిర్వహణ కార్యకలాపాలు ఎప్పటికప్పుడు జిల్లా వైద్యాధికారి పర్యవేక్షిస్తూ ఉండాలి. కానీ ఎందుకు పర్యవేక్షించడం లేదని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారి ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై దృష్టి సారించి రోగులకు అందుబాటులో సేవలు అందేలా చూడాలని కోరుతున్నారు.

# నిత్య పరిశోధకుడు, బహుభాషా వేత్త నలిమెల భాస్కర్

**వేద న్యూస్, హైదరాబాద్:**



ఆధునిక తెలుగు సాహిత్యంలో పరిశోధకుడిగా, బహుభాషావేత్తగా, అనువాదకుడిగా, రచయితగా విశేషంగా కృషి చేసి డా.నలిమెల భాస్కర్ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారని అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు. సిటీ కాలేజ్ మఖ్దూమ్ మొహియుద్దీన్ జాతీయ పురస్కార ప్రదాన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నిత్యానందరావు మాట్లాడుతూ విభిన్న భాషల్లో నిరంతరం కృషి చేస్తున్న నలిమెల భాస్కర్ కి మఖ్దూమ్ పురస్కారం ప్రదానం చేయటం ఎంతో సముచితమైన నిర్ణయమని అన్నారు. ముఖ్యంగా తెలుగు, తమిళ, మలయాళ భాషల్లోని సామెతల స్వరూప స్వభావాలను తులనాత్మకంగా విశ్లేషించటమే కాకుండా ప్రామాణిక గ్రంథాలను ప్రచురించారని అన్నారు. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో ప్రత్యేకించి తెలంగాణ భాష ఔన్నత్యాన్ని తెలియజేయటం కోసం తెలంగాణ పదబంధ కోశం తయారుచేశారని కొనియాడారు. కవిగా, ఉద్యమకారునిగా, అనువాదకునిగా బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించిన మఖ్దూమ్ లాంటి అధ్యాపకులు ఎందరో సిటీ కాలేజ్ గౌరవ ప్రతిష్ఠలను ఇనుమడింపజేశారని అన్నారు. వారి కృషిపై సమగ్రమైన పరిశోధన జరగవలసిన అవసరం ఉందని అన్నారు.

గౌరవ అతిథిగా పాల్గొన్న మన తెలంగాణ సంపాదకులు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ హైదరాబాద్ లో అభ్యుదయ సాహిత్యానికి కేంద్రబిందువుగా మఖ్దూమ్ వెలుగొందారని అన్నారు. తెలుగులో మఖ్దూమ్ జీవితం, సాహిత్యంపై జరగవలసినంత చర్చ జరగలేదని అభిప్రాయపడ్డారు. మఖ్దూమ్ ఆశయాలను, ఆదర్శాలను ఈ తరం కొనసాగించాలని అన్నారు. మఖ్దూమ్ పేరుతో ఒక జాతీయ పురస్కారాన్ని ఏర్పాటు చేసి, సాహితీవేత్తలకు ప్రదానం చేయటం అభినందనీయమని అన్నారు.

ఆత్మీయ అతిథిగా పాల్గొన్న ప్రముఖ కవి యాకూబ్ మాట్లాడుతూ, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వం గురించి మఖ్దూమ్ చూపిన బాటలో అందరం నడవాల్సిన సందర్భం ఇదనీ, పురస్కారాన్ని అందిస్తున్న నిర్వాహకులు, అవార్డు గ్రహీతలు, సిటీ కళాశాల విద్యార్థులు మఖ్దూమ్ తాత్విక వారసత్వాన్ని కొనసాగించాలని అన్నారు.

విశిష్ట అతిథి అన్నవరం దేవేందర్ మాట్లాడుతూ నలిమెల భాస్కర్ చాలా చిన్న వయసునుండే పద్య కవిత్వంతో పాటు వచన సాహిత్యంలో కూడా మంచి ప్రతిభ కనబరిచారని నవలలు కూడా రాశారని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్ మాట్లాడుతూ సిటీ కాలేజ్ పూర్వ అధ్యాపకుడైన మఖ్దూమ్ పేరుతో జాతీయ పురస్కారాన్ని ఉత్తమ సాహితీ వేత్తలకు 2019 నుండి పురస్కారం ప్రదానం చేస్తున్నామని, ఈ సంవత్సరం బహుభాషావేత్త నలిమెల భాస్కర్ గారికి అందించటం అవార్డు గౌరవాన్ని పెంచిందని అన్నారు. ఈ అవార్డు కింద పదివేలు నగదు బహుమతి, జ్ఞాపికను అందజేసి అతిథులు నలిమెల భాస్కర్ ను ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమాన్ని అవార్డు కమిటీ కన్వీనర్ డా.విప్లవ్ దత్ శుక్లా, సభ్యులు డా.యాదయ్య, డా.కోయి కోటేశ్వరావులు సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ పూర్వ ప్రిన్సిపాల్ డా.వెల్చాల కొండలరావు, తెలంగాణ సాహిత్య అకాడెమీ కార్యదర్శి డా.నామోజు బాలాచారి, అడిషనల్ కలెక్టర్ శ్యామ్ లాల్, వాహేద్, కవయిత్రి విమల, కరీం నగర్ సాహితీ సోపతి మిత్రులు డా.బూర్ల వెంకటేశ్వర్లు, గాజోజు నాగభూషణం, పొన్నం రవిచంద్ర, కందుకూరి అంజయ్య కాలేజ్ అధ్యాపక వర్గం, విద్యార్థులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు అక్రిడేషన్లు, హెల్త్ కార్డులు వెంటనే ఇవ్వాలి

### టీడబ్ల్యూజేఎఫ్ డిమాండ్

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**



జర్నలిస్టులకు అక్రిడేషన్లు, హెల్త్ కార్డులు వెంటనే ఇవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు పెరిక రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ జర్నలిస్టుల పరిస్థితులు దారుణంగా మారాయని, అనేక ఒడిదుడుకుల మధ్య వృత్తిబాధ్యతలు నిర్వహిస్తున్నారని, చాలీచాలని వేతనాలతో బతుకులీడుస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉండే మీడియాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. కనీస సమస్యలను పరిష్కరించకుండా ఏండ్ల తరబడి జాప్యం చేస్తున్నాయన్నారు. జర్నలిస్ట్ ల ఇండ్ల స్థలాల విషయంలో సర్కారు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సర్కారు రీవ్యూ పిటిషన్ వేసి వాదనలు చేయాలని, జర్నలిస్టులకు అనుకూలంగా తీర్పు వచ్చేలా చర్యలు తీసుకోవాలెక్కి, లేకపోతే కొత్త విధానం ద్వారా ఇండ్లస్థలాలు ఇవ్వాలన్నారు. కొత్త ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టి ఉద్యోగుల మాదిరిగా అమలుచేయాలన్నారు. జర్నలిస్ట కంట్రిబ్యూషన్‌ను ప్రభుత్వమే భరించాలన్నారు. ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో అమలయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. కొత్త అక్రిడిటేషన్ కార్డులను అందజేయడంలో మీడియా అకాడమీ విఫలమైందని, ఇప్పటికే రెండుసార్లు వాయిదా వేసిందని, వెంటనే అర్హులైన జర్నలిస్టులందరికీ కొత్త కార్డులివ్వాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా రిటైరైన జర్నలిస్టులకు పెన్షన్ పథకాన్ని అమలు చేయాలన్నారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టాలని, ఇందుకోసం ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ప్రత్యేక రక్షణ చట్టాన్ని తేవాలన్నారు. మహిళా జర్నలిస్టులకు పనిచేసే కార్యాలయం నుంచి ఇంటి వరకు రాత్రి పూట రవాణా సదుపాయం కల్పించాలన్నారు. అర్హత ఉన్న చిన్న, మధ్య తరహా పత్రికలు ఎంపానెల్మెంట్లో చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు మహమ్మద్ యూసుఫ్, వేములవాడ పట్టణ అధ్యక్షులు కొప్పుల ప్రసాద్, జిల్లా యూనియన్ నాయకులు తొగరి కరుణాకర్, మొహమ్మద్ షరీఫ్, శ్రీధర్, బిక్షపతి, వేణు, వెంకటస్వామి, ఆంజనేయులు, ప్రసాద్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

# భక్తుల కొంగు బంగారం.. కాళేశ్వరం

**మొదటి పేజీ తరువాయి**

కాశీలో మరణిస్తే మాత్రమే ముక్తి కలుగుతుంది కాని శ్రీ కాళేశ్వరంలో నివసించిన, స్వామి వారిని చూసినా, స్మరించుకున్నా ముక్తి కలుగుతుంది కాబట్టి కాశీక్షేత్రం కంటే కాళేశ్వరం వరిముల్లు వాసి ఎక్కువని నమ్మకం.

### ఆలయంలో ప్రత్యేక పూజలు



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కాళేశ్వరాలయంలో మంగళ, బుధ, గురు వారాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. మంగళవారం మొదటి రోజు ఉదయం 10 గంటలకు దీపారాదన,గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, రక్షా బందనం. దీక్షా వస్త్ర ధారణలతో ఉత్సవాల ను ప్రారంభించనున్నా దేవతాహ్వానం, నవగ్ర హారాదనం. 11:30 నిమిషాలకు మండప దేవతారాధన. వృషభధ్వజ పటాదివాసం, సాయంత్రం 4 గంటలకు అగ్ని ప్రతిష్ట, రుద్ర హవనం, రాత్రి 8 గంటలకు ఊరేగింపు, ఎదురుకోలు సేవ,బుధవారం రెండవరోజు. సాయంత్రం 4 గంటల 35 నిముషాలకు వేద బ్రాహ్మ ణులు నిర్ణయించిన ఉత్తరాషాడా నక్షత్రయుక్త కర్కాటక లగ్నసుముహూర్తంలో శ్రీ ముక్తీశ్వరం శుభానం దలకళ్యాణ మహోత్సవం అక్షతారోహణం జరుపబడును. రాత్రి 12 గంటలకు మహాభిషేకం, లింగోద్భవపూజ అనంతరం చండీహవనం మూడవ రోజు గురువారం ఉదయం 8 గంటలకు శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించిన అనంతరం మద్యాహ్నాం 12గంటలకు పూర్ణాహుతి ఆశీర్వాద పండిత సన్మాన కార్యక్రమాలను నిర్వహిస్తారు. సాయత్రం ఆదిముక్తీశ్వర స్వామివారి కళ్యాణం నిర్వహిస్తారు.

### మహాశివరాత్రికి ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశాం : ఆలయ ఈఓ మహేష్

మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా కాళేశ్వరం వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేశాం. సుదూరం ప్రాంతాల నుండి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంతో పాటు, గోదావరి తీరంలో చలువ పందిల్లు, మంచి నీటి వసతులు ఏర్పాటు చేశాం. ప్రధాన ఆలయంతో పాటు వివిధ ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించటం, వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశాం. అంతే కాకుండా వైద్య శిభిరం, అత్యవసర వాహనాలు, గోదావరి తీరంలో రెస్క్యూ సిబ్బంది, గజ ఈతగాలను నియమించాము. గోదావరిఖని, కరీంనగర్, హైదరాబాద్, వరంగల్,నర్సంపేట,గుంటూరు, మంచిర్యాల, సిరోంచ, గడ్చిరోల్లి, అహేరి తదితర ప్రాంతాల నుండి ప్రత్యేక బస్సు సౌకర్యం కూడా ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు.


## మహాశివరాత్రికి ముస్తాబవుతున్న ఆమనగల్లు దేవాలయం

- **గుడివాడ బృందంచే చింతామణి నాటకం ప్రదర్శన**
- **గ్రామస్థాయి ముగ్గుల పోటీలు,ట్రాక్టర్ రివర్స్ పోటీలు, భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు**
- **దేవాలయ చైర్మన్ వెంకటేశ్వర్లు**

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

నల్లగొండ జిల్లాలో ప్రఖ్యాతి గాంచిన ఆమనగల్లు లోని పార్వతి రామలింగేశ్వర స్వామి దేవాలయం మహాశివరాత్రి వేడుకలకు ముస్తాభవుతోంది.దేవాలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మహాశివ రాత్రి వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేయనున్నట్టు దేవాలయ చైర్మన్ తాళ్ళ వెంకటేశ్వర్లు తెలిపారు. మహాశివ రాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పెద్ద ఎత్తున ప్రజలు రామలింగేశ్వర స్వామి దేవాలయానికి తరలిరానున్న నేపథ్యంలో దేవాదాయ ధర్మాదాయశాఖ భద్రత ఏర్పాటు చేస్తుందన్నారు.సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవాదాయ తరఫున ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. మహాశివ రాత్రి సందర్భంగా ఆమనగల్లు ఉమ్మడి గ్రామస్థాయిలో మహిళలు అన్ని రంగాల్లో ముందుండే విధంగా మహిళలకు ప్రత్యేకంగా ముగ్గుల పోటీలు ఏర్పాటు, రైతులకు ఉత్సాహాన్ని నెలకొల్పేందుకు ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహించనున్నారు. అనంతరం సూర్యాపేట, మిర్యాలగూడ బృందాలచే కల్చరల్ ప్రోగ్రామ్స్, చింతామణి నాటక ప్రదర్శన గుడివాడ వారిచే నిర్వహించబడునని తెలిపారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే, గ్రామ ప్రజలు, దేవదాయశాఖ అధికారులు, పోలీస్ శాఖ సమిష్టి కృషితో శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. శివరాత్రి వేడుకల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని దేవాలయ చైర్మన్ కోరారు.





### ప్రభుత్వం స్కాలర్ షిప్ రియంబర్స్మెంట్

## వెంటనే విడుదల చేయాలి

- **సబ్ కలెక్టర్ కార్యాలయంలో డిఏఓకి వినతి పత్రం**

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

కాంగ్రెస్ ప్రభుత్వం బకాయిలో ఉన్న రూ.8,350 లక్షల కోట్ల రూపాయల స్కాలర్ షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ లను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర సైదా నాయక్ అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ మిర్యాలగూడ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో డిఏఓకి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు జగన్,వీరన్న లతో పాటు నాయకులు అఖిల్, అనిల్, మనీ, రాజేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073